http://www.agnidharanews.com

# అగ్నిధార

నిజాల నిప్పు కణిక

బుధవారం 11 మార్చి 2026

ఎడిటర్: చేగొండ రవి కుమార్ యాదవ్

పేజీలు : 5 వెల : 5/-

Published from Peddapalli Ciculated by Hyderabad, , , Sangareddy, jagityala, Rangareddy, Khammam,Medchal Medak Siddipet, Nalgonda, , warangal, Nizamabad

## విలేకరులు కావలెను

ప్రజా గళాన్ని బలంగా వినిపిస్తూ.. అవినీతిపై సమరాన్ని సాగిస్తున్న అగ్నిధార తెలుగు దినపత్రికలో పనిచేయుటకు అనుభవం, ఆసక్తి గల వారికి అవకాశం కలదు. అన్ని జిల్లాలు, డివిజన్లు, మున్సిపల్ మరియు మండల కేంద్రాల్లో విలేకరులు కావలెను.

ఆసక్తి కలిగినవారు సంప్రదించగలరు

సెల్ : 80088 17828



# హోటల్.. హడల్!

- ఎల్పీజీ గ్యాస్ సరఫరాపై కేంద్ర ప్రభుత్వం ఆంక్షలు
- పశ్చిమాసియాలో కొనసాగుతున్న యుద్ధం నేపథ్యంలో..
- గృహావసరాలకు, అత్యవసర సేవలు అందించే ఆస్పత్రులకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచన
- దీంతో వాణిజ్య సిలిండర్ల సరఫరా నిలిపివేసిన గ్యాస్ ఏజెన్సీలు
- రాష్ట్రంలో హైదరాబాద్, వరంగల్, ఖమ్మం వంటి ప్రధాన నగరాల్లోని హోటళ్లపై ఎఫెక్ట్!
- చిన్న, మధ్యతరగతి రెస్టారెంట్లు, మెస్‌లు, టిఫిన్ సెంటర్లపైనా ప్రభావం పడే అవకాశం
- ఇప్పటికే ముంబై, బెంగళూరులో 20 శాతం వరకు మూతపడ్డ హోటళ్లు!
- గృహావసరాలపై ఆందోళన వద్దు.. సిలిండర్ల నిల్వలు పుష్కలంగా ఉన్నాయంటున్న అధికారులు



## పశ్చిమాసియా ఉద్రిక్తతల ప్రభావం భారతీయులపై పడనీయవద్దు

- మంత్రులకు ప్రధాని మోదీ దిశానిర్దేశం
- ఇరాన్ ఎం అమెరికా, ఇజ్రాయెల్ వార్ ఎఫెక్ట్
- భారీగా పెరుగుతున్న పెట్రోలియం ఉత్పత్తులు ధరలు
- వాటి ప్రభావం భారతీయులపై పడకుండా చూడాలని మంత్రులకు ప్రధాని మోదీ ఆదేశం



## పది'కి పకడ్బందీ ఏర్పాట్లు

నిఘా నీడలో టెన్త్ పరీక్షలు పరీక్షలకు హాజరుకానున్న 5.28 లక్షల మంది విద్యార్థులు

హాల్‌టికెట్‌పైనే క్యూఆర్ కోడ్

సీసీ కెమెరాల ముందే ప్రశ్నపత్రాల ఓపెనింగ్

హైదరాబాద్

రాష్ట్రవ్యాప్తంగా ఈ నెల 14 నుంచి పదవ తరగతి పరీక్షలు మొదలవుతాయి. ఏప్రిల్ 16తో ఈ పరీక్షలు ముగుస్తాయి మొత్తంగా 5,28,239 మంది పరీక్షలకు హాజరవుతున్నారు. వీరిలో రెగ్యులర్ విద్యార్థులు 5,17,727 మంది. 5,329 ప్రభుత్వ పాఠశాలల నుంచి 2,07,573 మంది, 1,057 గురుకులాల నుంచి 60,139 మంది, 5,288 ప్రైవేట్, ఎయిడెడ్ స్కూల్స్ నుంచి 2,50,015 మంది పరీక్షలకు హాజరవుతున్నారు. ఉదయం 9.30 నుంచి మొదలయ్యే పరీక్ష మధ్యాహ్నం 12.30 గంటలకు ముగుస్తుంది. విద్యార్థులు పరీక్ష కేంద్రాలను తేలికగా - మిగతా3లో

# ఇరవయ్యేళ్లు ఇబ్బందుల్లేకుండా..

- స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ సాఫ్ట్‌వేర్ అభివృద్ధికి సర్కారు నిర్ణయం
- ఏకీకృత పోర్టల్ తీసుకువచ్చే యోచనలో మంత్రి పొంగులేటి
- ఎన్ఐసీ సహకారంతో సర్వర్ల సమస్యలు తలెత్తకుండా చర్యలు
- ప్రస్తుతం రాష్ట్రంలో భూముల వివరాలు, సర్వే, రిజిస్ట్రేషన్ల వివరాలు వేర్వేరు డొమైన్లలో అందుబాటులో
- ఏకీకృత పోర్టల్ తరహాలోనే స్టాంపుల శాఖ సాఫ్ట్‌వేర్‌ను కూడా అభివృద్ధి



హైదరాబాద్

వ్యవసాయేతర భూములు, ఆస్తుల క్రయవిక్రయ లావాదేవీల కోసం స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ వినియోగిస్తున్న సాఫ్ట్‌వేర్‌ను అభివృద్ధి చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. గత పదేళ్ల కాలంలో రిజిస్ట్రేషన్ల సంఖ్య (భూములు, ఆస్తుల క్రయ విక్రయ లావాదేవీలు) నాలుగు రెట్లు పెరిగిన నేపథ్యంలో వచ్చే 20 ఏళ్ల కాలానికి తగిన విధంగా సాఫ్ట్‌వేర్‌ను అప్‌డేట్ చేయాలని నిర్ణయించింది. ఇప్పటికే ఈ పోర్టల్‌ను నిర్వహిస్తున్న నేషనల్ ఇన్ఫర్మాటిక్స్ సెంటర్ (ఎన్ఐసీ) సహకారంతోనే మరో 20 ఏళ్ల పాటు ఎలాంటి సమస్యలు ఉత్పన్నం కాకుండా సాఫ్ట్‌వేర్‌ను ఆధునీకరించాలని సర్కారు భావిస్తోంది. ఈ కార్యక్రమానికి అవసరమైన నిధులు వచ్చే బడ్జెట్‌లో కేటాయించనున్నారు. - మిగతా3లో



## 'ప్రభుత్వం ముందు తలవంచని ఏకైక వ్యక్తి రాహుల్'

- 'రేయింబవళ్లు నెహ్రూను విమర్శించేవారు నేడు ఆయనను ప్రశంసిస్తున్నారు': రిజిజుపై ప్రియాంక ఫైర్
- కేంద్ర మంత్రి కిరణ్ రిజిజుపై కాంగ్రెస్ ఎంపీ ప్రియాంక గాంధీ ఆగ్రహం
- రేయింబవళ్లు నెహ్రూను విమర్శించినవారు ఇప్పుడు ఆయన్ను ప్రశంసిస్తున్నారని ఎద్దేవా

## మూడేళ్లలో పంచాయతీలకు

# శాశ్వత భవనాలు

ప్రతిపాదనలు సిద్ధం చేయండి

పీఆర్ శాఖకు డిప్యూటీ సీఎం భట్టి సూచన



హైదరాబాద్

వచ్చే మూడేళ్లలో రాష్ట్రంలో శాశ్వత భవ నాల్లేని గ్రామపంచాయితీల భవనాలు నిర్మించే దిశలో ప్రణాళికలు సిద్ధం చేసుకోవా లని పంచాయతీరాజ్ శాఖకు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు సూచించారు. స్థలాలు అందుబాటులో ఉన్నచోట తహసీల్దార్, ఎంపీడీవో కార్యాలయాలు కలిపి నిర్మించే అవకాశాలు పరిశీలించాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారుల ఆరోగ్యంపై దృష్టి సారించాలని, అవసరమైన పౌష్టికాహారంతో పాటు బోధనా పద్ధతులతో తర్ఫీదు ఇవ్వాలన్నారు. పట్టణాల్లో రోడ్లపై కొందరు చంటి బిడ్డలతో యాచక వృత్తి కొనసాగిస్తున్నారని, వారందరినీ శిశు విహార్‌లో చేర్చుకుని అవసరమైన చర్యలు చేపట్టాలన్నారు. రోడ్లపై చంటి బిడ్డలు పట్టపగలు ఎండకు, వర్షాకాలంలో వానకు తడిసి వారి విలువైన బాల్యం మసకబారకుండా చూడాలన్నారు. శిశు విహార్లలో ఆధునిక వంట గదిని నిర్మించాలని సూచించారు. మంగళవారం సచివాలయంలో 2026--27 బడ్జెట్ ప్రతిపాదనలపై - మిగతా3లో




## బంగాల్‌లో అర్హులైన ఏ ఒక్క ఓటరు పేరునూ తొలగించం

- సీఈసీ జ్ఞానేశ్ కుమార్
- అర్హత ఉన్న ప్రతి ఒక్కరు తమ ఓటు హక్కు వినియోగించుకునే అవకాశం
- ఓటర్ల జాబితాలో తప్పు లేకుండా చూడటమే ప్రత్యేక సమగ్ర సవరణ లక్ష్యమన్న జ్ఞానేష్ కుమార్
- రాజ్యాంగ నిబంధనలకు అనుగుణంగా:
- ఇలా చేస్తే ఎన్నికల కమిషన్ సహించదు

## గోదావరి పుష్కరాలకు

# 8 కోట్ల మంది!

పుణ్య స్నానాలు చేసేందుకు వస్తారని అంచనా వేస్తున్న ప్రభుత్వం

మంత్రి శ్రీధర్‌బాబు అధ్యక్షతన మంత్రివర్గ ఉప సంఘం భేటీ.. సన్నాహకాలపై చర్చ

వచ్చే ఏడాది జూన్ 26–జూలై 7 వరకు

ఆది పుష్కరాలు.. 2028 జూలై 13–24 అంత్య పుష్కరాలు

నదీతీరంలోని 96 ప్రాంతాల్లో ఏర్పాట్లకు నిర్ణయం



హైదరాబాద్

అత్యంత భక్తి ప్రపత్తులతో ఆచరించే గోదావరి పుష్కరాలు వచ్చే సంవత్సరం జూన్ 26 నుంచి జూలై 7 వరకు జరగనున్నాయి. ఆది పుష్కరాల తర్వాత నిర్వహించే అంత్య పుష్కరాలు 2028 జూలై 13 నుంచి 24 వరకు జరుగుతాయి. ఈ మేరకు పండితులు తేదీలు ఖరారు చేసి ప్రభుత్వానికి అందజేశారు. పుష్కరాల నిర్వహణపై ప్రభుత్వం ఏర్పాటు చేసిన మంత్రివర్గ ఉప సంఘం మంగళవారం పుష్కరాల నిర్వహణ ప్రణాళిక ఖరారుపై నిర్వహించిన సమావేశంలో ఈ తేదీలను అధికారికంగా - మిగతా3లో

# హోటల్.. హడల్!

పశ్చిమాసియాలో కొనసాగుతున్న యుద్ధం హోటల్ రంగాన్ని తీవ్రస్థాయిలో ప్రభావితం చేస్తోంది. గల్ఫ్ దేశాల నుంచి పెట్రో ఉత్పత్తుల దిగుమతికి ఆటంకాలు ఎదురవుతుండటంతో దేశంలో వాణిజ్యావసరాలకు ఎల్పీజీ గ్యాస్ సరఫరాపై కేంద్ర ప్రభుత్వం ఆంక్షలు విధించింది. గృహావసరాలకు, అత్యవసర సేవలు అందించే ఆస్పత్రులకు మాత్రమే ప్రాధాన్యత ఇవ్వాలని సూచించింది. మరోవైపు ఈ నెల 7వ తేదీ నుంచి గ్యాస్ సిలిండర్ల ధరలను పెంచింది. కేంద్రం ఆంక్షల నేపథ్యంలో గ్యాస్ ఏజెన్సీలు కమర్షియల్ సిలిండర్ల సరఫరాను నిలిపివేశాయి. దీంతో ఇప్పటికే ముంబై, బెంగళూరులో 20 శాతం హోటళ్లు మూతపడినట్లు తెలుస్తోంది. చిన్న, మధ్య తరగతి హోటళ్లు, మెస్‌లు, హాస్టళ్లపై సైతం దీని ప్రభావం పడుతోంది. రాష్ట్రంలో హైదరాబాద్, వరంగల్, ఖమ్మం వంటి ప్రధాన నగరాల్లోనూ సమస్య తలెత్తుతున్నట్టు సమాచారం.



**వీరికి హోటళ్లే ఆధారం**

తెలంగాణలో 1.49 కోట్ల గృహ వినియోగదారులు ఉండగా, నెలకు కోటికి పైగా సిలిండర్లు వినియోగమవుతున్నాయి. అలాగే 5 లక్షల వాణిజ్య కనెక్షన్లు ఉండగా, వినియోగం దానికి రెట్టింపు స్థాయిలో ఉంటుంది. కాగా గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో 25 వేలకు పైగా మీడియం స్థాయి హోటళ్లు, రెస్టారెంట్లు ఉండగా, చిన్న హోటళ్లు భారీ ఎత్తున ఉన్నాయి. మెస్‌లు, చిన్న చిన్న రోడ్డుపక్క హోటళ్లు లెక్కలేనన్ని ఉన్నాయి. ఇక స్టార్ హోటళ్లు, క్లబ్బులు, బార్ అండ్ రెస్టారెంట్లు కూడా హైదరాబాద్ నగరంలో పెద్ద ఎత్తున కొనసాగుతున్నాయి. చిన్న చిన్న హోటళ్లు రోజుకు ఒక సిలిండర్, పెద్దవి 3--5 వినియోగిస్తాయి. వినియోగదారులను బట్టి రెస్టారెంట్లు, బార్లలో కూడా రోజుకు ఐదుకు తక్కువ కాకుండా సిలిండర్ల వినియోగం ఉంటుంది. అదే స్టార్ హోటళ్లు రోజుకు 25 సిలిండర్లకు పైగా వినియోగిస్తాయి. కరీంనగర్, వరంగల్, నిజామాబాద్, ఖమ్మం, మంచిర్యాల, రామగుండం, కొత్తగూడెం వంటి నగరపాలక సంస్థలతో పాటు జిల్లా కేంద్రాలు, మునిసిపాలిటీలు, మండల కేంద్రాలలోని హోటళ్లలో కూడా గ్యాస్ సిలిండర్ల వినియోగం పెద్ద ఎత్తున ఉంటుంది. రాష్ట్రవ్యాప్తంగా లక్షలాది మంది ఉద్యోగులు, విద్యార్థులకు హోటల్ ఆహారమే ఆధారం. కమర్షియల్ గ్యాస్ సిలిండర్ల సరఫరాను పూర్తిగా నిలిపివేస్తే హోటళ్లు మూత పడడమే కాకుండా లక్షలాది మంది ఉపాధికి గండి పడుతుంది.

**60--65 శాతం ఎల్పీజీ దిగుమతి**

భారత్ 60--65 శాతం ఎల్పీజీ కోసం దిగుమతులపైనే ఆధారపడుతోంది. ఇరాన్, సౌదీ అరేబియా వంటి దేశాల నుంచి సరఫరా ఆగిపోవడంతో దేశవ్యాప్తంగా గ్యాస్ కొరత ఏర్పడింది. 2025లో ఎల్పీజీ వినియోగం 31 మిలియన్ టన్నులకు చేరగా, దేశీయంగా గ్యాస్ ఉత్పత్తి కేవలం 12--13 మిలియన్ టన్నులకే పరిమితమవడంతో సమస్య మరింత ఉధృతమైంది.

**ప్రత్యామ్నాయాల అన్వేషణలో హోటల్ రంగం**

తాజా పరిస్థితులతో ప్రత్యామ్నాయ ఇంధనాల వైపు హోటల్ రంగం మొగ్గు చూపుతోంది. ఎలక్ట్రిక్ స్టవ్‌లు, బయోగ్యాస్ వంటి ఆప్షన్లు పరిశీలిస్తున్నప్పటికీ, అవి ఖర్చుతో కూడుకున్నవే గాక తక్షణ పరిష్కారానికి వీలుకానివనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. మరోవైపు వంటగదుల్లో విద్యుత్ వినియోగం పెంచే ఆలోచనలో హోటళ్ల యజమానులు ఉన్నారు.

**హైదరాబాద్‌లో పుష్కలంగా నిల్వలు**

యుద్ధం కారణంగా గ్యాస్ కొరత ఏర్పడుతుందనే ప్రచారంతో సాధారణ రోజుల కంటే ఇప్పుడు గృహ వినియోగం బుకింగ్‌ల సంఖ్య 15 శాతం నుంచి 20 శాతం వరకు పెరిగినట్లు తెలుస్తోంది. హైదరాబాద్‌లో సిలిండర్ల నిల్వలు పుష్కలంగా ఉన్నాయని, వినియోగదారులు అనవసరంగా భయాందోళన చెందవద్దని అధికారులు విజ్ఞప్తి చేస్తున్నారు.

**గ్యాస్ నిల్వలు సమృద్ధిగా ఉన్నాయి: భారత్ గ్యాస్**

వంట గ్యాస్ కొరతపై జరుగుతున్న ప్రచారంతో ప్రజలు ఆందోళన చెందుతుండడంతో గ్యాస్ కంపెనీలు అప్రమత్తమ య్యాయి. భారత్ పెట్రోలియం కంపెనీ లిమిటెడ్..ఎల్పీజీ వినియోగదారులు ఆందోళన చెందవద్దంటూ సంక్షిప్త సందేశాలు పంపుతోంది. 'ఇంధన సరఫరాలో కొరత ఉందని సోషల్ మీడియాలో ప్రజలను తప్పుదారి పట్టించే, ఆధార రహితమైన వార్తలు ప్రచారం చేస్తున్నారు. దేశంలో ఇంధనం సమృద్ధిగా అందుబాటులో ఉంది. ప్రజలు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని తెలియజేస్తున్నాం. ఇంధనాన్ని సమర్థవంతంగా, అవసరానికి అనుగుణంగా వినియోగించడం మంచిది' అని బీపీసీఎల్ ఆంగ్లంలో ఎస్ఎంఎస్‌లు పంపించింది. అయితే గృహ వినియోగదారులు ఒకసారి గ్యాస్ బుక్ చేసిన తర్వాత మరోసారి బుక్ చేయాలంటే ఇప్పటివరకు ఉన్న 21 రోజుల గడువును 25 రోజులకు పెంచుతూ ఆయిల్ కంపెనీల నుంచి ఆదేశాలు వచ్చినట్లు ఏజెన్సీలు చెబుతున్నాయి.

**హోటళ్లు మూతపడే ప్రమాదం: హోటల్స్ అసోసియేషన్**

వాణిజ్య ఎల్పీజీ సరఫరా నిలిచిపోతే హోటల్ రంగం మూతపడే పరిస్థితి ఏర్పడుతుందని తెలంగాణ రాష్ట్ర హోటళ్ల సంఘం ఆందోళన వ్యక్తం చేసింది. సంఘం అధ్యక్షుడు ఎస్.వెంకటరెడ్డి, కార్యదర్శి సీహెచ్ వేణుగోపాల్ తదితరులు పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డిని కలిసి సమస్యను వివరించేందుకు చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. మంత్రి ఢిల్లీకి వెళ్లిన కారణంగా వచ్చిన తర్వాత ఆయన్ను కలుస్తామని వెంకటరెడ్డి 'సాక్షి'కి తెలిపారు. ఇప్పటివరకు హైదరాబాద్ నగరంలో హోటళ్లు మూతపడిన దాఖలాలు లేవని, కానీ సోమవారం నుంచి కమర్షియల్ సిలిండర్ల సరఫరాను నిలిపివేశారని ఆయన వివరించారు.

# పశ్చిమాసియా ఉద్రిక్తతల ప్రభావం భారతీయులపై పడనీయవద్దు

పశ్చిమాసియా ఉద్రిక్తతలు మరింత తీవ్రమవుతున్న నేపథ్యం లో ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర మంత్రులకు మంగళవారం కీలక సూచనలు చేశారు. పెట్రోలియం ఉత్పత్తుల ధరలు, సరఫరాలపై పడే ప్రభావం నుంచి భారతీయులకు రక్షణ కల్పించాలని ఆదేశించారు. ఇందుకోసం కేంద్ర మంత్రులు అందరూ సమన్వయంతో పనిచేయాలని ఆయన స్పష్టం చేసినట్లు అధికారిక వర్గాలు తెలిపాయి. ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయెల్‌లు దాడులు చేసినప్పటి నుంచి పశ్చిమాసియాలో తీవ్ర ఉద్రిక్తతలు నెలకొన్నాయి. దీని వల్ల అంతర్జాతీయ మార్కెట్లో ముడిచమురు ధరలు భారీగా పెరుగుతున్నాయి. అంతేకాదు భారతదేశంలో ఎల్?పీజీ సహా ఇతర పెట్రోలి యం ఉత్పత్తుల కొరత ఏర్పడవచ్చనే ఆందోళనలు చెలరేగుతు న్నాయి. ఎందుకంటే, భారతదేశం తన ముడిచమురు, సహజ వాయువు అవసరాల కోసం దిగుమతులపైనే ఎక్కువగా ఆధారపడుతోంది. అందుకే పెరిగిన ధరల భారం సామాన్య ప్రజలపై పడకుండా ప్రధాని మోదీ తగు చర్యలు తీసుకుంటున్నారని ప్రభుత్వ వర్గాలు పేర్కొన్నాయి. పెట్రోలియం ఉత్పత్తులు, వంట గ్యాస్ కొరత లేకుండా చూడాలని ఆయన మంత్రులకు దిశానిర్దేశం చేశారని చెప్పాయి.

**మంత్రులతో మోదీ భేటీ**

మంగళవారం ప్రధాని మోదీ, విదేశీ వ్యవహారాల మంత్రి ఎస్.జైశంకర్?, చమురు శాకామంత్రి హర్దీప్? సింగ్ పూరీ, ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్?, వాణిజ్య శాఖామంత్రి పీయూశ్? గోయల్?లతో భేటీ అయ్యారు. ప్రస్తుతం



దేశంలోని ఇంధన నిల్వల పరిస్థితిపై సుదీర్ఘంగా చర్చించారు. నిజానికి భారతదేశంలో తన ఇంధన అవసరాల కోసం పశ్చిమాసియా దేశాలపై ఎక్కువగా ఆధారపడుతోంది. అయితే, ప్రస్తుతం ఇతర దేశాల నుంచి కూడా చమురు దిగుమతులు చేసుకుంటోంది. ముఖ్యంగా అమెరికా, రష్యా, వెనెజువెలా, ఆస్ట్రేలియా సహా ఇతర ఓషియానిక్? దేశాల నుంచి ముడి చమురును సేకరిస్తోందని సమాచారం.

**వంట గ్యాస్?కు అధిక ప్రాధాన్యత**

మరోవైపు కేంద్ర ప్రభుత్వం, దేశంలో ఎల్?పీజీ, సీఎన్?జీ, పైప్?డ్? వంట గ్యాస్? సరఫరాలకు ఎలాంటి ఇబ్బంది ఏర్పడకుండా, సహజ వాయువు కేటాయింపుల క్రమాన్ని మార్చింది. గృహ అవసరాలకు, రవాణా రంగాలకు నిరంతరాయంగా సరఫరాలు చేసేందుకు వీలుగా ఎల్?పీజీ ఉత్పత్తి, సీఎన్?జీ, పైప్?డ్? వంట గ్యాస్?కు మిగిలిన అన్ని రంగాల కంటే అధిక ప్రాధాన్యత ఇవ్వాలని ఆదేశించింది. ఇరాన్ వర్సెస్ అమెరికా, ఇజ్రాయెల్? యుద్ధం తీవ్రమవుతున్న నేపథ్యంలో మన దేశ? గ్యాస్ సరఫరా 30 శాతం మేర తగ్గింది. ఈ నేపథ్యంలోనే చమురు మంత్రిత్వశాఖ గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసింది. భారతదేశంలో రోజు వారీ గ్యాస్ వినియోగం 191 మిలియన్ స్టాండర్డ్? క్యూబిక్? మీటర్లు. ఇందులో సగభాగం దిగుమతుల ద్వారానే వస్తోంది. హోర్ముజ్ జలసంధి గుండా ట్యాంకర్ల రాకపోకలు నిలిచిపోవడంతో, పశ్చిమాసియా నుంచి రావాల్సిన సుమారు 60 ?మిలియన్ స్టాండర్డ్? క్యూబిక్? మీటర్ల గ్యాస్ సరఫరా నిలిచిపోయింది. అందుకే ప్రస్తుతం అందుబాటులో ఉన్న ద్రవీకృత సహజ వాయువు (ఎల్?ఎన్?జీ)ను తిరిగి వర్గీకరించారు. దీని ప్రకారం, ఎల్?పీజీ ఉత్పత్తి, సీఎన్?జీ, పైప్?డ్ వంట గ్యాస్? డిమాండ్?ను 100 శాతం తీర్చనున్నారు. వాణిజ్య వినియోగదారులకు 80 శాతం, ఎరువుల యూనిట్లకు 70 శాతం మేర అవసరాలు తీర్చనున్నారు. కాగా, బ్లాక్ మార్కెట్? విక్రయాలను అరికట్టేందుకు కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే సిలిండర్ బుకింగ్ వ్యవధిని 21 రోజుల నుంచి 25 రోజులకు పెంచింది. చమురు సంస్థలపై నిత్యావసర సరకుల చట్టాన్ని ప్రయోగించింది. దీనితో ప్రభుత్వ ఆదేశాలను అనుసరించి ఎల్?పీజీ ఉత్పత్తిని 10 శాతం మేర పెంచినట్లు రిఫైనరీలు పేర్కొన్నాయి. అక్రమ నిల్వలు, బ్లాక్ మార్కెట్? చేసి, ఎవరూ కృత్రిమ కొరత ఏర్పరచకుండా నిరోధించేందుకు పలు చర్యలు తీసుకున్నట్లు స్పష్టం చేశాయి.ooooo

# 'ప్రభుత్వం ముందు తలవంచని ఏకైక వ్యక్తి రాహుల్'

లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాపై ప్రతిపక్షాలు ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానంపై చర్చ సందర్భంగా కాంగ్రెస్ ఎంపీ ప్రియాంక గాంధీ వాద్రా కీలక వ్యాఖ్యలు చేశారు. అవిశ్వాస తీర్మానంపై చర్చ వేళ మాజీ ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ వ్యాఖ్యలను కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు ఉదహరించడాన్ని తీవ్రంగా విమర్శించారు. దేశ తొలి ప్రధాని నెహ్రూను రేయింబవళ్లు విమర్శించే వారు ఇప్పుడు ఆయన వ్యాఖ్యలను ఉటంకిస్తున్నారని ఎద్దేవా చేశారు.

**అందుకేనా నన్ను రేయింబవళ్లు విమర్శిస్తున్నారు?**

తాను నవ్వుతున్నానని రిజిజు చెబుతున్నారని, అందుకే రేయిం బవళ్లు తనను విమర్శిస్తున్నారని ప్రియాంక గాంధీ పేర్కొన్నా రు. తమ వాదన కోసం రిజిజు నెహ్రూ వ్యాఖ్యలను ఉటంకిం చారని తాను తెలియజేస్తున్నానన్నారు. "వారు (రిజిజును ఉద్దేశించి) అకస్మాత్తుగా నెహ్రూను గౌరవించడం ప్రారంభిం చారు. నెహ్రూ ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేయడం కోసం అలాంటి ప్రసంగం చేశారు " అని ప్రియాంక గాంధీ వ్యాఖ్యానించారు.

**'ప్రభుత్వం ముందు తలవంచని ఏకైక వ్యక్తి రాహుల్'**

కేంద్ర ప్రభుత్వం ముందు తలవంచని ఏకైన వ్యక్తి ఉన్నారని, ఆయనే ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ అని ప్రియాంక గాంధీ తెలిపారు. ఈ సభలో విపక్ష నేత ఎటువంటి సంకోచం లేకుండా నిజాలు మాట్లాడుతున్నారని పేర్కొన్నారు. ట్రెజరీ బెంచీలపై కూర్చున్న వారు ఆ సత్యాన్ని జీర్ణించుకోలేకపో తున్నారని విమర్శించారు.

**అమెరికా ముందు భారత ప్రభుత్వం తలవంచింది!**



పార్లమెంట్ హౌస్ కాంప్లెక్స్‌లో విలేకరులతో మాట్లాడుతూ కేంద్రంపై ప్రియాంక మండిపడ్డారు. ట్రేడ్ డీల్‌పై సంతకం చేయడం ద్వారా భారత ప్రభుత్వం అమెరికా ముందు తలవంచిందని ఆరోపించారు. బీజేపీ ప్రభుత్వ సంస్థలను నాశనం చేసిందని విమర్శించారు. ప్రతిపక్షాలు ప్రభుత్వ సంస్థలను కాపాడటానికి ప్రయత్నిస్తున్నాయని తెలిపారు.

**రాహుల్ ప్రశ్నలకు ప్రభుత్వం దగ్గర సమాధానాలు లేవు!**

కేంద్ర ప్రభుత్వం స్పీకర్ ఓం బిర్లాపై ఒత్తిడి తెచ్చి ఆయన స్వాతంత్ర్యానికి ఆటంకం కలిగించిందని ప్రియాంక గాంధీ ఆరోపించారు. అందుకే ఓం బిర్లాపై విపక్షాలు అవిశ్వాస తీర్మానాన్ని తీసుకురావాల్సిన అవసరం వచ్చిందన్నారు. రాహుల్ గాంధీ సభలో లేవనెత్తిన ప్రశ్నలకు ప్రభుత్వం దగ్గర సమాధానాలు లేవని విమర్శించారు. అందువల్లే ప్రజల దృష్టిని మళ్లించడానికి కేంద్రం ప్రభుత్వం సభలో అసంబద్ధమైన అంశాలను లేవనెత్తుతోందని పేర్కొన్నారు.

**నెహ్రూ వ్యాఖ్యలను ఊటంకించిన రిజిజు**

స్పీకర్ ఓం బిర్లాపై విపక్షాలు ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానంపై మంగళవారం సభలో చర్చ జరిగింది. ఈ క్రమంలో 1954లో అప్పటి లోక్‌సభ స్పీకర్ జీవి మౌలంకర్‌ను తొలగించే తీర్మానంపై చర్చ సందర్భంగా నెహ్రూ చేసిన వ్యాఖ్యలను రిజిజు ఉదహరించారు. "స్పీకర్‌కు ఎదురుగా కూర్చున్న గౌరవ సభ్యులు (ఎంపీలు), అవిశ్వాస తీర్మానంపై సంతకం చేసినవారు, దానికి మద్దతు ఇచ్చినవారు దయచేసి తీర్మానాన్ని ఓ సారి చదవండి. దానిపై సంతకం చేయడం దుర్మార్గం. ఈ తీర్మానంపై సంతకం చేసే ముందు ఎంపీలు అసలు దాన్ని చదివారా అనే సందేహం నాకు కలుగుతోంది. వారు దానిని చదివి ఉంటే ఆ పత్రంపై సంతకం చేసే ముందు వందసార్లు సంకోచించేవారు" అని నెహ్రూ చెప్పినట్లు రిజిజు లోక్‌సభలో మాజీ ప్రధాని వ్యాఖ్యలను ఉటంకించారు. కాంగ్రెస్ ఎంపీ ప్రియాంక గాంధీని లోక్‌సభలో విపక్షనేతగా పని చేసి ఉంటే ఆమె మంచి పనితీరును కనబర్చేవారని కిరణ్ రిజిజు వ్యాఖ్యానించారు. "ప్రియాంక గాంధీ అక్కడ కూర్చుని నవ్వుతున్నారు. ఆమెను లోక్‌సభలో ప్రతిపక్ష నేతగా చేసి ఉంటే మంచి పనితీరు కనబర్చేవారు. కనీసం ఆమె సభలో కూర్చుని వింటున్నారు, నవ్వుతున్నారు " అని రిజిజు వ్యాఖ్యానించారు. ఈ క్రమంలో రిజిజుపై ప్రియాంక గాంధీ మండిపడ్డారు. నెహ్రూను రేయింబవళ్లు విమర్శించే వారు ఇప్పుడు ఆయన వ్యాఖ్యలను ఉటంకిస్తున్నారని కౌంటర్ వేశారు.

## ఇండిగో సీఈవో పీటర్ ఎల్బర్స్ రాజీనామా... వెంటనే పెరిగిన షేర్ల ధర

**వ్యక్తిగత కారణాలుగా పేర్కొన్నప్పటికీ, సంక్షోభం తర్వాతే ఈ నిర్ణయం**

**గత డిసెంబర్‌లో ఇండిగో తీవ్ర ఆపరేషనల్ ఇబ్బందులు ఎదుర్కొన్న వైనం**

**తాత్కాలిక బాధ్యతలు చేపట్టనున్న సహ వ్యవస్థాపకుడు రాహుల్ భాటియా**

**సీఈఓ రాజీనామా వార్తతో 3 శాతం పైగా పెరిగిన ఇండిగో షేర్లు**

దేశంలోని అతిపెద్ద విమానయాన సంస్థ ఇండిగోలో కీలక పరిణామం చోటుచేసుకుంది. సంస్థ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ (సీఈఓ) పీటర్ ఎల్బర్స్ తన పదవికి తక్షణమే రాజీనామా చేశారు. గత డిసెంబర్‌లో సంస్థ ఎదుర్కొన్న తీవ్రమైన ఆపరేషనల్ సంక్షోభం జరిగిన మూడు నెలలకే ఈ నిర్ణయం వెలువడటం గమనార్హం. అయితే, రాజీనామాకు వ్యక్తిగత కారణాలను ఆయన పేర్కొన్నారు. ఈ మేరకు ఇండిగో సంస్థ ఒక అధికారిక ప్రకటన విడుదల చేసింది. ఎల్బర్స్ రాజీనామా తక్షణమే అమల్లోకి వస్తుందని వెల్లడించింది. "వ్యక్తిగత కారణాల వల్ల సీఈఓ పదవి నుంచి తప్పుకుంటున్నాను. నోటీస్ పీరియడ్‌ను మినహాయించాలని కోరుతున్నాను" అని ఎల్బర్స్ తన రాజీనామా లేఖలో పేర్కొన్నారు. ఆయన రాజీనామాను ఇండిగో బోర్డు ఆమోదించింది. 2022 సెప్టెంబర్ నుంచి ఆయన అందించిన సేవలకు ధన్యవాదాలు తెలిపింది. కొత్త సీఈఓను నియమించే వరకు సంస్థ సహ వ్యవస్థాపకుడు, మేనేజింగ్ డైరెక్టర్ రాహుల్ భాటియా తాత్కాలికంగా బాధ్యతలు నిర్వహిస్తారు. గత ఏడాది డిసెంబర్‌లో ఇండిగో చరిత్రలోనే అత్యంత తీవ్రమైన సంక్షోభాన్ని ఎదుర్కొంది. భారీ సంఖ్యలో విమానాలు రద్దు కావడం, గంటల తరబడి ఆలస్యమవ్వడంతో వేలాది మంది ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఒకానొక దశలో ఒకే రోజు 300కు పైగా విమానాలు రద్దయ్యాయి. పైలట్ల కొరత, డీజీసీఏ కొత్త నిబంధనలు వంటివి ఈ సమస్యకు కారణమయ్యాయి. ఈ వైఫల్యాలపై అప్పట్లో ఎల్బర్స్ స్వయంగా క్షమాపణలు చెప్పగా, డీజీసీఏ ఆయనకు షోకాజ్ నోటీసులు కూడా జారీ చేసింది. కాగా, సీఈఓ రాజీనామా వార్తల నేపథ్యంలో ఇండిగో షేర్లు ఎన్ఎస్ఈలో 3.46 శాతం పెరిగి రూ.4,383.50 వద్ద ముగియడం విశేషం. పూర్తిస్థాయి సీఈఓ కోసం అన్వేషణ ప్రారంభించినట్లు సంస్థ తెలిపింది.

## బంగాల్‌లో అర్హులైన ఏ ఒక్క ఓటరు పేరునూ తొలగించం

బంగాల్‌లో రాబోయే అసెంబ్లీ ఎన్నికలను హింస, బెదిరింపులకు తావు లేకుండా జరపడమే ఎన్నికల సంఘం బాధ్యత అని ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ అన్నారు. బంగాల్‌లో ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో చీఫ్? ఎలక్షన్? కమిషనర్ బృందం బంగాల్‌లో పర్యటించింది.




రాష్ట్రంలో త్వరలో జరగబోయే ఎన్నికలపై రెండు రోజుల సమీక్షల అనంతరం విలేకరుల సమావేశంలో జ్ఞానేశ్ కుమార్ మాట్లాడారు.

బంగాల్‌లో త్వరలో జరగబోయే అసెంబ్లీ ఎన్నికల్లో అర్హత ఉన్న ఏ ఒక్క ఓటరు పేరును ఓటరు జాబితా నుంచి తొలగించబోమని జ్ఞానేశ్ కుమార్ అన్నారు. అసెంబ్లీ ఎన్నికలను ప్రశాంతంగా, బెదిరింపులకు తావు లేకుండా జరపడమే ఎన్నికల సంఘం ఉద్దేశమని ప్రధాన ఎన్నికల కమిషనర్ తెలిపారు. అర్హత ఉన్న ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కు వినియోగించుకునే అవకాశం ఉందన్నారు. రాజ్యాంగంలో ఉన్న నిబంధనల ప్రకారమే అన్ని రాష్ట్రాల్లో ప్రత్యేక సమగ్ర సవరణ జరుగుతోందన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరి పేరు ఓటరు జాబితాలో ఉండేలా చూడటం, ఓటర్ల జాబితాలో తప్పు లేకుండా చూడటమే ప్రత్యేక సమగ్ర సవరణ లక్ష్యమని ఆయన తెలిపారు. ఎన్నికల్లో ప్రభుత్వ అధికారులు ఎన్నికల సంఘం నియమాలకు అనుగుణంగా పని చేయాలని చెప్పారు. బంగాల్?లో ఓటింగ్? శాతం ఎక్కువగా ఉందని, బంగాల్ ప్రజలు రాజ్యాంగాన్ని చాలా గౌరవిస్తారని పేర్కొన్నారు. ఈ ఎన్నికలు బంగాల్ ప్రజలకు గర్వకారణమన్నారు. అధికారులు భయానికి, పక్షపాతానికి తావు లేకుండా పని చేయాలని సూచించారు.

**రాజ్యాంగ నిబంధనలకు అనుగుణంగా:**

టీఎంసీ, బీజేపీ మధ్య రాజకీయ వేడి రాజేసిన ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) గురించి మాట్లాడుతూ రాజ్యాంగ నిబంధనలకు అనుగుణంగా దేశవ్యాప్తంగా ఎస్ఐఆర్ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. భారతదేశమంతటా రాజ్యాంగ నిబంధనల ప్రకారం ఎస్ఐఆర్ నిర్వహిస్తున్నారన్నారు. న్యాయపరమైన ఆదేశాల ప్రకారం కచ్చితంగా ప్రాసెస్ చేస్తున్నామని ఆయన తెలిపారు. ఫిబ్రవరి 28న చేసిన ఎస్?ఐఆర్? ప్రకారం ఓటర్ల జాబితా ప్రచురించిన తర్వాత, ఎన్నికల సంఘం తన వెబ్‌సైట్‌లో ఓటర్ల జాబితాను సకాలంలో అప్లోడ్ చేస్తుందని ఆయన అన్నారు. దాదాపు 64 లక్షల మంది ఓటర్లను ఎన్నికల సంఘం ఓటర్ల జాబితా నుంచి తొలగించిందని, మరో 60 లక్షల మందిని పరిశీలనలో ఉంచిందని అధికార పార్టీ టీఎంసీ చేసిన ఆరోపణలపై ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ వివరణ ఇచ్చారు.

**ఇలా చేస్తే ఎన్నికల కమిషన్ సహించదు**

బంగాల్? అసెంబ్లీ ఎన్నికలు ఎన్ని దశల్లో జరగాలనేది రాష్ట్ర అధికార యంత్రాంగం చేపట్టే శాంతిభద్రతలపై ఆధారపడి ఉంటుందన్నారు. రాజకీయ నాయకులు ఓటర్లను, ఎన్నికల అధికారులను బెదిరించడం, హింసను ప్రేరేపించడం లాంటి వాటిని చేస్తే ఎన్నికల కమిషన్ సహించదని ఆయన హెచ్చరించారు. ఎన్నికల ప్రక్రియలో, ఎటువంటి అలసత్వాన్ని సహించబోమన్నారు. బంగాల్‌లో దాదాపు 80,000 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని, వాటిలో దాదాపు 61,000 గ్రామీణ ప్రాంతాల్లో ఉన్నాయని సీఈసీ తెలిపారు. ఓటింగ్ ప్రక్రియలో పారదర్శకతను పెంచడానికి రాష్ట్రవ్యాప్తంగా పోలింగ్ బూత్‌లలో 100 శాతం వెబ్‌కాస్టింగ్ ఉంటుందని ఆయన చెప్పారు. గత ఏడాది నవంబర్‌లో సవరణ ప్రారంభమైనప్పటి నుంచి దాదాపు 63.66 లక్షల పేర్లు, అంటే దాదాపు 8.3 శాతం ఓటర్ల పేర్లు తొలగించారు, దీంతో ఓటర్ల సంఖ్య దాదాపు 7.66 కోట్ల నుంచి 7.04 కోట్లకు తగ్గింది.

**బంగాల్ ఎన్నికల నోటిఫికేషన్ ఎప్పుడంటే**

మరోవైపు బంగాల్ సహా దేశంలోని నాలుగు రాష్ట్రాలు, ఒక కేంద్రపాలిత ప్రాంతానికి సంబంధించిన అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్‌ను ఈ వారం ప్రకటించే అవకాశం ఉందని ఎన్నికల సంఘం వర్గాలు తెలిపాయి. అసోం, కేరళ, తమిళనాడు, బంగాల్? రాష్ట్రాలతో పాటు కేంద్రపాలిత ప్రాంతమైన పుదుచ్చేరి అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్‌ను ప్రకటించేందుకు ఎన్నికల సంఘం సిద్ధంగా ఉందని సమాచారం.

## ఆ ధైర్యం చేయకండి.. పిటిషనర్లపై సుప్రీం ఫైర్

దిల్లీ: జ్యుడిషియల్ అధికారులను ప్రశ్నిస్తూ..పిటిషన్ దాఖలు చేసిన పలువురిపై సుప్రీం కోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. సర్ ప్రక్రియలో తొలగించిన ఓటర్ల వివరాలు వెరిఫై చేసేందుకు అత్యున్నత న్యాయస్థానం (గాబజూతీవఎవ జశీబతీ) నియమించిన జ్యుడిషియల్ అధికారులపై అనుమానాలు వ్యక్తం చేయడాన్ని తప్పు పట్టింది. అప్పీళ్లను పరిశీలిస్తున్న అధికారులను ప్రశ్నించే ధైర్యం చేయొద్దని హెచ్చరించింది. అధికారులు ఇప్పటికే ఓవర్ టైం పని చేస్తున్నారని.. వారిని ఇంకేం చేయమంటారని అసహనం వ్యక్తం చేసింది. వారిపై ఫిర్యాదులు చేస్తే సహించబోమంది. పేర్ల తీసివేతపై అభ్యంతరం తెలుపుతూ ఇచ్చిన దరఖాస్తులను స్వీకరించలేదని ఆరోపిస్తూ.. దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ జరిపిన న్యాయస్థానం ఈ వ్యాఖ్యలు చేసింది. ప్రజల అప్పీళ్లను పరిశీలిస్తున్న జ్యుడిషియల్ అధికారులకు తగిన సాయం, లాజిస్టికల్ మద్దతు అందించాలని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ బెంగాల్ ప్రభుత్వాన్ని, ఎన్నికల కమిషన్‌ను ఆదేశించారు. సర్ ప్రక్రియలో పేర్ల తొలగింపునకు వ్యతిరేకంగా వస్తున్న అప్పీళ్లను విచారించడానికి హైకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తులు, మాజీ న్యాయమూర్తులతో కూడిన అప్పిలేట్ ట్రైబ్యునల్‌ను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. జ్యుడిషియల్ అధికారులు తిరస్కరించిన ఓటర్ల అభ్యంతరాలను నూతన ట్రైబ్యునల్ పరిశీలిస్తుందని తెలిపారు.

# 50 లక్షల ఓట్ల తొలగింపు?

**హైదరాబాద్ :** దేశవ్యాప్తంగా జరుగుతున్న ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ తెలంగాణలో ఏప్రిల్, మే నెలల్లో జరగనుంది. ఈ ప్రక్రియ ద్వారా సుమారు 50 లక్షల ఓట్లదాకా బారీగా తొలగింపు జరగొచ్చని అధికారులు అంచనా వేస్తున్నారు. గడిచిన పదిహేనేళ్లలో రెండు మూడు చోట్ల ఓట్లు నమోదు చేసుకుని అన్నిచోట్లా కొనసాగుతున్న వారి డూప్లికేట్ ఓట్లు ఇకపై కొనసాగవని ఈసీ అధికారులు చెప్తున్నారు. తెలంగాణా వ్యాప్తంగా వున్న 3.35 కోట్ల ఓట్లు ఈ సవరణ తర్వాత 2.75 లేదా 2.80 కోట్లకు తగ్గిపోయే అవకాశముంది. పట్టణీకరణ, ఉపాధి అవకాశాల వల్ల ఇటీవల చాలామంది హైదరాబాద్ కు వలస వచ్చి స్థిరపడుతున్నారు. ఐనప్పటికీ వారి స్వంత గ్రామాల్లో కూడా ఓట్లు కొనసాగిస్తూ సందర్భాన్నిబట్టి రెండు చోట్లా ఓటు వినియోగించుకుంటున్నారు. ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్ నుంచి హైదరాబాద్ వచ్చిన వారు ఇక్కడ ఓటు నమోదు చేసుకున్నారు. రెండు రాష్ట్రాల్లోనూ అసెంబ్లీ ఎన్నికలు వేర్వేరుగా జరుగుతుండటం వల్ల రెండు చోట్లా ఓటు వినియోగించుకుంటున్నారు. తాజా సవరణ జరిగితే ఆ డూప్లికేషన్కి అవకాశం ఉండదు. హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల్లో కలిపి మొత్తంగా 87 లక్షల ఓట్లు ఉన్నాయి. అందులో ఈ రకమైన డూప్లికేట్ ఓట్లు సుమారు 20 లక్షలదాకా ఉండొచ్చని అంచనా వేస్తున్నారు. వీరిలో ఆంధ్రప్రదేశ్ జిల్లాలనుంచి వచ్చినవారితోపాటు తెలంగాణ గ్రామీణ ప్రాంతాలనుంచి వచ్చి రాజధాని నగరంలో స్థిరపడి ఓటు నమోదుచేసుకున్నవారూ ఉన్నారు. తెలంగాణలో పట్టనీకరణ వేగంగా జరుగుతోంది. హైదరాబాద్ తోపాటు జిల్లాల్లోని వివిధ ప్రధాన పట్టనాలకు వలసలు పెరిగాయి. పెద్ద పట్టనాలైన వరంగల్, నిజామాబాద్, ఖమ్మం, కరీంనగర్ లాంటి పట్టనాల్లో ఓటర్లు భారీగా పెరిగారు. ఆమేరకు ఆయా పట్టణ పరిసల గ్రామాల్లో ఓటర్ల సంక్య తగ్గాలి కానీ వారు ఓటు మాత్రం రెండు చోట్లా కొనసాగిస్తున్నారు. ఈ స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ద్వారా గ్రామీణ తెలంగాణలో కూడా సుమారు మరో 30 లక్షల ఓట్లదాకా తగ్గొచ్చని అంచనా. కొన్ని చోట్ల గ్రామాల్లో ఓటు కొనసాగించేందుకు ప్రాధాన్యత ఇవ్వగా కొందరు స్వగ్రామాల్లోనే ఓటు కొనసాగింపునకు




సుముఖంగా వున్నారు. ఏది ఏమైనా రెండు చోట్ల మాత్రం ఓటు ఉండకుండా వుండేందుకు ఈసీ అన్ని జాగ్రత్త చర్యలూ తీసుకుంటోంది. బూత్ లెవల్ ఆఫీసర్ల ఆధ్వర్యంలో ఎన్యూమరేటర్ల ద్వారా మొదట ప్రతీ ఇల్లూ సర్వేచేసి ప్రాధమిక జాబితారూపొందిస్తారు. ఆ సమయంలో ఓటరు స్వయంగా అందుబాటులో ఉండి అక్కడే తన ఓటు కొనసాగించాల్సిందగా చెప్పవచ్చు. లేదా మీ తరపున ఆ ఇంటి యజమాని తగిన డాక్యుమెంటు ఆధారాలిచ్చి ఫారంలో సంతకం చేసినా సరిపోతుంది. ఒకే వ్యక్తికి రెండు లేదా అంతకంటే ఎక్కువ ఓట్లున్నట్టు గుర్తించేందుకు ఈసీ ఓ ప్రత్యేక సాఫ్ట్ వేర్ వినియోగించబోతోంది. డెమోగ్రఫీ సిమిలర్ ఎంట్రీస్ ను పరిశీలిస్తారు. పేరు, తండ్రిపేరు, వయసు, చిరునామా ల్లో సిమిలారిటీ వుంటే వాటిని గుర్తించి నోటీసులు ఇస్తారు. ఎవరైతే ఈ రకమైన ఆధారాలు ఇవ్వరో ఆ ఓటు తొలగిస్తారు. స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ) మొత్తం 4 దశల్లో జరుగుతుంది. మొదటిది డోర్ టు డోర్ సర్వే - మీ బూత్ లెవల్ ఆఫీసర్లు ప్రతీ ఇంటికీ వెళ్లి సర్వేచేస్తారు. రెండవది - ఆ సర్వే ఆధారంగా డ్రాఫ్ట్ ఓటర్ల జాబితా విడుదల రూపొందిస్తారు. వాటి ముసాయిదా జాబితా విడుదలచేస్తారు. మూడవ దశ - జాబితాలో ఏవైనా తప్పులున్నా, ఓటు నమోదు కాకున్నా అభ్యంతరాలు, క్లెయిమ్‌లు స్వీకరించి సవరిస్తారు. నాలుగవది ఫైనల్ ఓటర్ల జాబితా. ఇప్పటికే ఎన్నికలు జరిగిన బీహార్, త్వరలో ఎన్నికలు జరగబోతోన్న బెంగాల్ , తమిళనాడు తదితర రాష్ట్రాలో ఈ ఎస్ ఐ ఆర్ పై పలు ఆరోపణలు వస్తున్నాయి. అధికార పార్టీ, లేదా యంత్రాంగం ఉద్దేశపూర్వకంగా ఓ వర్గానికి లేదా రాజకీయంగా తమకు వ్యతిరేకుల ఓట్లను వలసుల పేరిట తొలగిస్తున్నారన్న విమర్శలు వస్తున్నాయి. మరి తెలంగాణలో ఎలా నిర్వహిస్తారో ప్రక్రియ ప్రారంభమైతే గానీ తెలియదు.

# వార్ ఎఫెక్ట్... తగ్గిన యూరియా ఉత్పత్తి

**అదిలాబాద్ :** రాబోయే ఖరీఫ్ సీజన్‌లో రైతులకు యూరియా కొరత తప్పదని, వ్యవసాయ రంగంపై దీని ప్రభావం పడుతుందని నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పశ్చిమాసియాలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఇరాన్‌పై ఇజ్రాయెల్-అమెరికా సంయుక్తంగా దాడులు చేస్తున్నాయి. ఇరానే సైతం ప్రతిదాడులకు దిగుతుండటంతో భీకర యుద్ధం జరుగుతోంది. ఈ యుద్ధం ఎఫెక్ట్ మిగతా ప్రపంచ దేశాలపై పడుతోంది. తాజాగా.. రామగుండం ఎరువుల కర్మాగారంలో యూరియా ఉత్పత్తిపై యుద్ధం ప్రభావం చూపుతోంది. ఈ కార్మాగారం పూర్తిగా గ్యాస్ ఆధారితంగా పనిచేస్తుంది. పశ్చిమాసియా దేశాల నుంచే ఇక్కడకు గ్యాస్ సరఫరా అవుతోంది. ప్రస్తుతం కర్మాగారానికి గ్యాస్ కొరత ఏర్పడటంతో ఈ నెల 6 నుంచి ఉత్పత్తి సామర్థ్యాన్ని అధికారులు సగానికి తగ్గించారు. సరఫరాలో అంతరాయం ఇలాగే కొనసాగితే యూరియా ఉత్పత్తి మరింత క్షీణించే అవకాశం ఉందని నిపుణులు చెబుతున్నారు.రామగుండం కర్మాగారం రోజువారీ యూరియా ఉత్పత్తి లక్ష్యం 3,850 టన్నులు. అయితే ప్రస్తుత పరిస్థితుల కారణంగా ఉత్పత్తిని సగానికి తగ్గించారు. ఇక్కడి విద్యుదుత్పాదక కేంద్రం కూడా గ్యాస్ ఆధారంగానే నడుస్తోంది. దీంతో విద్యుదుత్పత్తి కూడా నిలిచిపోనుంది. ప్రత్యామ్నాయ అత్యవసరాలకు ఎన్‌పీడీసీఎల్ విద్యుత్తును వినియోగంలోకి తెచ్చుకునే అంశాన్ని అధికారులు పరిశీలిస్తున్నట్లు తెలిసింది. గత ఐదు నెలలుగా ఎలాంటి అంతరాయాలు లేకుండా ఆర్ఎఫ్‌సీఎల్‌లో యురియా ఉత్పత్తి కొనసాగుతుండగా.. ప్రస్తుతం నిలిపివేయాల్సిన పరిస్థితులు రానున్నాయనే అధికారులు ఆందోళన వ్యక్తం



చేస్తున్నారు.రామగుండం ఎరువుల కర్మాగారంలో యూరియా వార్షిక ఉత్పత్తి టార్గెట్ 12.7 లక్షల టన్నులు. ఈ ఏడాది ప్రారంభంలోనే అత్యధిక కాలం ఫ్యాక్టరీ షట్‌డౌన్‌లోనే ఉంది. దీంతో ఫిబ్రవరి నెలాఖరు వరకు 8.5 లక్షల టన్నుల యూరియా ఉత్పత్తి మాత్రమే జరిగింది. ఈనెల 6 వరకు 1,800 టన్నుల యూరియా ఉత్పత్తి నమోదైంది. దేశవ్యాప్తంగా గ్యాస్ ఆధారిత ఎరువుల కర్మాగారాల్లో ఇంచుమించు ఇదే పరిస్థితి నెలకొందని అధికారులు చెబుతున్నారు. యూరియా ఉత్పత్తి తగ్గితే దాని ప్రభావం రైతులపై పడే అవకాశం ఉంది. రైతులు ఖరీఫ్ సీజన్ సాగు కోసం సిద్ధమవుతున్నారు. మరో 3 నెలల్లో సీజన్ ప్రారంభం కానుంది. ఈ నేపథ్యంలో యూరియా కొరత ఏర్పడితే సాగు కష్టమవుతుందని.. అన్నదాతలకు కష్టాలు తప్పేలా లేవని వ్యవసాయ నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

# భారీగా సోలార్ ఉత్పత్తికి సింగరేణి ప్రణాళికలు

**అదిలాబాద్ :** పర్యావరణహిత గ్రీన్ ఎనర్జీ ఉత్పత్తిలో భాగంగా సింగరేణి సంస్థ కీలక నిర్ణయం తీసుకుంది. కార్మికుల నివాస గృహాలపై రూఫ్ టాప్ సౌర ఫలకాలను ఏర్పాటు చేయాలని డిసైడ్ అయింది. ఈ మేరకు సంస్థ ఏర్పాట్లు చేస్తోంది. సుమారు రూ. 65 కోట్ల వ్యయంతో 15 వేల కిలోవాట్ల విద్యుత్ ఉత్పత్తిని లక్ష్యంగా పెట్టుకుంది. దీనివల్ల సంస్థపై ప్రతి నెలా పడుతున్న రూ. 50-60 కోట్ల విద్యుత్ బిల్లుల భారం కొంత మేర తగ్గనుంది.సింగరేణి సంస్థ గ్రీన్ ఎనర్జీ ఉత్పత్తిలో భాగంగా కీలక నిర్ణయం తీసుకుంది. తాజాగా సింగరేణి ఏరియాల్లోని కార్మికుల నివాస గృహాలపై సోలార్ ప్యానళ్లు ఏర్పాటు చేసి విద్యుత్తు ఉత్పత్తి చేసేందుకు సిద్ధమవుతున్నారు. ఇందుకోసం అనువైన నివాస గృహాలను గుర్తించేందుకు ఆరు నెలల క్రితమే సింగరేణి అధికారులు సర్వే నిర్వహించారు. ఎక్కడైతే చెట్లు, నీళ్ల ట్యాంకులు లేకుండా ఖాళీగా నివాస గృహాలు ఉన్నాయో.. వాటిపై ఈ ప్యానళ్లు ఏర్పాటు చేసి సోలార్ విద్యుత్తు ఉత్పత్తి చేసేందుకు సిద్ధమవుతున్నారు. ఇందులో భాగంగా సింగరేణి యాజమాన్యం గతేడాది డిసెంబర్‌లో ఓ సంస్థతో అగ్రిమెంట్ సైతం కుదుర్చుకుంది. పదేళ్లపాటు ఈ సంస్థనే కార్మికుల ఇళ్లపై సోలార్ నిర్వహణ బాధ్యత చేపట్టనుంది.సింగరేణి క్వార్టర్లలో కార్మికుల గృహ



విద్యుత్తు వినియోగానికి ప్రస్తుతం నెలకు సుమారుగా రూ.50 నుంచి 60 కోట్ల మేర చెల్లిస్తోంది. రూఫ్ టాప్ సౌర విద్యుత్తుతో సింగరేణికి ఆ భారం చాలా వరకు తగ్గనుంది. అన్ని ఏరియాల వ్యాప్తంగా 15 వేల కిలోవాట్ల మేర సౌర విద్యుత్తును ఉత్పత్తి చేయాలని సంస్థ టార్గెట్‌గా పెట్టుకుంది. ఇందు కోసం రూ.65 కోట్ల ఖర్చు చేయనుంది. ఉద్యోగుల గృహాలకు వినియోగించగా మిగిలిన మొత్తాన్ని గ్రిడ్‌కి అనుసంధానించనున్నారు. ఈ మేరకు 800 మెగావాట్ల సౌర విద్యుత్తు ఉత్పత్తే లక్ష్యంగా ఇప్పటికే పలు ప్లాంట్లను ఏర్పాటు చేశారు. ఈ ప్లా?ంట్ల ద్వారా ప్రస్తుతానికి 500 మెగావాట్ల వరకు లక్ష్యాన్ని సాధించింది. రూఫ్‌టాప్ సౌర విద్యుత్తు పనులు త్వరలో ప్రారంభం అవుతాయని మణుగూరు వర్క్‌షాపు డీజీఎం శ్రీకాంత్ తెలిపారు. సౌర ఫలకలు ఏర్పాటు చేసేందుకు అన్ని విధాలుగా సిద్ధంగా ఉన్నామని అన్నారు.కాగా, సింగరేణి సంస్థ చేపట్టిన ఈ రూఫ్ టాప్ సౌర విద్యుత్ ప్రాజెక్టు వల్ల బహుళ ప్రయోజనాలు ఉన్నాయని పర్యావరణ నిపుణులు చెబుతున్నారు. ప్రధానంగా.. ప్రతి నెలా కార్మికుల గృహ విద్యుత్ వినియోగం కోసం సంస్థ వెచ్చిస్తున్న రూ. 50 నుంచి 60 కోట్ల భారం గణనీయంగా తగ్గుతుందని చెబుతున్నారు. 15 వేల కిలోవాట్ల విద్యుత్ ఉత్పత్తి లక్ష్యంతో చేపట్టిన ఈ ప్రాజెక్టు ద్వారా సంస్థకు దీర్ఘకాలికంగా ఆర్థిక పొదుపు చేకూరుతుందని అంటున్నారు. పర్యావరణ పరంగా చూస్తే.. బొగ్గు ఆధారిత విద్యుత్తుపై ఆధారపడటం తగ్గి, కార్బన్ ఉద్గారాలు తగ్గుతాయని..ఇది గ్రీన్ ఎనర్జీ లక్ష్యానికి దోహదపడుతుందని వెల్లడిస్తున్నారు. గృహ అవసరాలకు పోగా మిగిలిన విద్యుత్తును గ్రిడ్‌కు అనుసంధానించడం ద్వారా అదనపు శక్తి వనరుగా మారుతుందని చెబుతున్నారు. ఇది సంస్థ ఆర్థికాభివృద్ధికే కాకుండా.. సింగరేణిని పర్యావరణ హితమైన తీర్చిదిద్దడంలో కీలక పాత్ర పోషిస్తుందని అంటున్నారు.

## మూడేళ్లలో పంచాయతీలకు శాశ్వత భవనాలు

-మొదటిపేజీ తరువాయి

డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి సీతక్క ఆధ్వర్యంలో ప్రీ--బడ్జెట్ సమావేశం నిర్వహించారు. గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి, మహిళలు, చిన్నారుల సంక్షేమానికి ఈ శాఖలకు బడ్జెట్‌లో ప్రత్యేక ప్రాధాన్యం ఇవ్వనున్నట్లు తెలిపారు. ఉపాధి హామీకి కేంద్ర ప్రభుత్వం కోతలు విధిస్తున్న నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం ఆ లోటును భర్తీ చేసే దిశగా చర్య లు తీసుకుంటుందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి అవకాశాలు తగ్గకుండా ఉండేలా రాష్ట్రం నుంచి అవసరమైన నిధు లు కేటాయించి పథకం అమలు కొన సాగించేందుకు చర్యలు తీసుకుంటామని భట్టి విక్ర మార్క, సీతక్క వెల్లడించారు. ఏజెన్సీలో ఇసుక మైనింగ్ ట్రైబల్ ఏజెన్సీల ద్వారా మాత్రమే జరగాలని భట్టి స్పష్టం చేశారు. సమావేశంలో ఆర్థిక శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ సందీప్ కుమార్ సుల్తానియా, పంచాయతీరాజ్‌శాఖ స్పెషల్ సీఎస్ సంజయ్ కుమార్, మైనింగ్ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శ్రీధర్, సీసీఎల్‌ఏ సెక్రటరీ లోకేశ్ కుమార్, మహిళా శిశు సంక్షేమ శాఖ కమిషనర్ అనితా రామచంద్రన్, పీఆర్ కమిషనర్ దివ్య దేవరాజ్, సమాచార శాఖ స్పెషల్ కమిషనర్ ప్రియాంక, గృహ నిర్మాణ శాఖ సెక్రటరీ గౌతం, డిప్యూటీ సీఎం స్పెషల్ సెక్రటరీ కృష్ణ భాస్కర్ పాల్గొన్నారు.

## పది'కి పకడ్బందీ ఏర్పాట్లు

-మొదటిపేజీ తరువాయి

తెలుసుకునేందుకు హాల్‌టికెట్లపై క్యూఆర్ కోడ్‌ను ముద్రించారు. విద్యార్థులకు ఇప్పటికే హాల్‌టికెట్లు పంపినట్టు అధికారులు తెలిపారు. మీ సేవ కేంద్రాల ద్వారా కూడా డౌన్‌లోడ్ చేసుకునే వెసులుబాటు కల్పించారు. 8096958096 వాట్సాప్ నంబరు ద్వారా కూడా హాల్‌టికెట్లు పొందొచ్చు.

కంగారు పెట్టకుండా నిఘా

పరీక్షలు సజావుగా నిర్వహించాలని జిల్లా అధికారులను పాఠశాల విద్య డైరెక్టర్ డాక్టర్ నవీన్ నికోలస్ ఆదేశించారు. పటిష్టమైన నిఘా వ్యవస్థ, సీసీ కెమెరాల పర్యవేక్షణ ఉంటుందన్నారు. ప్రతీ కేంద్రానికి సిట్టింగ్ స్క్వాడ్ ఏర్పాటు చేశామని చెప్పారు. అయితే, ఎట్టి పరిస్థితుల్లోనూ నిఘా సిబ్బంది, పరీక్షల సిబ్బంది విద్యార్థులను ఆందోళనకు గురిచేసేలా వ్యవహరించొద్దని ఆదేశించారు. ప్రశాంత వాతావరణంలో పరీక్షలు జరగాలన్నారు. సమస్యాత్మక ప్రాంతాల్లో ముందే భద్రత ఏర్పాట్లు చేయాలని పోలీసు విభాగాన్ని కోరారు. గత అనుభవాలను దృష్టిలో ఉంచుకొని జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పరీక్ష కేంద్రంలో తాగునీరు, వైద్య సదుపాయాలు కల్పించాలని అధికారులను నికోలస్ ఆదేశించారు. సీసీ కెమెరాల ముందే పరీక్ష పేపర్ ఓపెన్ చేసేలా ఏర్పాట్లు చేశారు.

## గోదావరి పుష్కరాలకు 8 కోట్ల మంది!

-మొదటిపేజీ తరువాయి

ప్రకటించింది. కుంభమేళాకు చేసే ఏర్పాట్ల తరహాలోనే ఏర్పాట్లు ఉండాలని నిర్ణయించారు. గతంలో జరిగిన గోదావరి పుష్కరాల అనుభవాలను గమనంలో ఉంచుకొని ప్రణాళిక ఖరారు చేయాలని నిర్ణయించారు. వచ్చే పుష్కరాల్లో దాదాపు 8 కోట్ల మంది స్నానాలు ఆచరించే అవకాశం ఉందని మంత్రి శ్రీధర్‌బాబు అధ్యక్షతన జరిగిన ఉప సంఘం సమవేశంలో అంచనా వేశారు. మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, కొండా సురేఖ, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, సీతక్క, అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, ప్రభుత్వ సలహాదారులు సుదర్శన్‌రెడ్డి ఈ భేటీలో పాల్గొన్నారు. తెలంగాణ బ్రాండ్ మార్మోగేలా... మన సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించేలా శాశ్వత ప్రాతిపదికన పనులు చేపట్టాలని సంబంధిత అధికారులను కమిటీ ఆదేశించింది. భారీ సంఖ్యలో పుణ్యస్నానాలకు వస్తారని భావిస్తున్నందున, వీలైనన్ని ఎక్కువ ప్రాంతాల్లో పుష్కర ఏర్పాట్లు ఉండాలని పేర్కొంది. ఈ మేరకు 96 ప్రాంతాలను అధికారులు ఎంపిక చేశారు. ఆయా ప్రాంతాల్లో స్నాన ఘట్టాలు, సులభంగా చేరుకునేలా మెరుగైన రోడ్లు నిర్మించాలని ఆదేశించింది. వానాకాలంలో పనులకు ఇబ్బందులుంటాయని, ఈలోపే పనులు మొదలయ్యేలా చూడాలని ఆదేశించింది. ఈ నెల చివరి నాటికి డీపీఆర్‌లను పూర్తి చేయాలని పేర్కొంది. ముఖ్యమైన ప్రాంతాలను ముందుగా ఎంపిక చేసి యుద్ధప్రాతిపదికన పనులు చేయాలని సూచించగా, రద్దీ ఎక్కువగా ఉంటుందని భావించిన 9 ప్రాంతాలను తొలి విడత పనులకు అధికారులు ఎంపిక చేశారు. సమన్వయలోపం తలెత్తకుండా గోదావరి పుష్కరాల నిర్వహణకు ప్రత్యేకంగా స్పెషల్ ఆఫీసర్, శాఖల వారీగా నోడల్ అధికారులను నియమిస్తున్నట్టు కమిటీ పేర్కొంది.

## ఇరవయ్యేళ్లు ఇబ్బందుల్లేకుండా..

-మొదటిపేజీ తరువాయి

దాదాపు రూ.10 కోట్లు అవసరమవుతాయని అంచనా వేస్తుండగా, ఈ మేరకు స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ చేసిన ప్రతిపాదనకు ఆర్థిక శాఖ ఆమోదం తెలిపినట్టు సమాచారం.

### ఏకీకృత పోర్టల్ తరహాలోనే..!


ప్రస్తుతం రాష్ట్రంలో భూముల వివరాలు, సర్వే, రిజిస్ట్రేషన్ల వివరాలు వేర్వేరు డొమైన్లలో అందుబాటులో ఉన్నాయి. అయితే, ఈ మొత్తం డేటా, ఇతర సమాచారాలను సమీకృతం చేస్తూ ఏకీకృత పోర్టల్ తీసుకురావాలని రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి భావిస్తున్నారు. అందులో భాగంగా ఏకీకృత పోర్టల్ తరహాలోనే స్టాంపుల శాఖ సాఫ్ట్‌వేర్‌ను కూడా అభివృద్ధి చేయాలని నిర్ణయించారు. రానున్న ఇరవై ఏళ్ల సమాచారాన్ని నిక్షిప్తం చేయడంతో పాటు, రోజువారీ కార్యకలాపాలను నియంత్రించే సర్వర్లతో సహా ఇతర అంశాల్లో సాంకేతిక సమస్యలు తలెత్తకుండా పోర్టల్‌కు కొత్త సొబగులు అద్దనున్నారు. ఈ బాధ్యతలు తీసుకున్న స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ కమిషనర్ రాజీవ్‌గాంధీ హనుమంతు ఎప్పటికప్పుడు ఇందుకు అవసరమైన సమాచారం తీసుకుంటూ, ఎన్‌ఐసీతో సమన్వయం చేసుకుంటూ 2047 వరకు ఉపయోగపడేలా సాఫ్ట్‌వేర్‌ను ఆధునీకరించే పనిలో నిమగ్నమయ్యారు. మరో ఆరు నెలల్లోపు ఈ ప్రకియ పూర్తవుతుందని, 20 ఏళ్ల పాటు రిజిస్ట్రేషన్ల శాఖ నిర్వహించే క్రయ విక్రయ లావాదేవీలకు ఎలాంటి అవాంతరాలు లేని కొత్త సాఫ్ట్‌వేర్ అందుబాటులోకి వస్తుందని తెలుస్తోంది.

## హెచ్ బీ కాలనీలో ఎల్ఐజీ, ఎంఐజీలు

**హైదరాబాద్ :**పేద, మధ్యతరగతి ప్రజల సొంతింటి కల సాకారం చేసే దిశగా తెలంగాణ సర్కార్ వేగంగా అడుగులు వేస్తోంది. హైదరాబాద్ శివారులో ఎల్ఐజీ, ఎంఐజీ( వర్గాలకు తక్కువ ధరలకే ఇళ్లను కట్టించి ఇవ్వడానికి ప్రణాళికలు రచిస్తోంది. అందుకు కావాల్సిన స్థలాలపై తాజాగా హౌసింగ్ బోర్డు దృష్టిసారించింది. ఈనెల 25 నుంచి ఏప్రిల్ 4 వరకు కోర్ అర్బన్ రీజియన్ ఎకానమీ(క్యూర్) పరిధిలోని హౌసింగ్ బోర్డు, దక్కన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ల్యాండ్ హోల్డింగ్స్ స్థలాలను గుర్తించి వాటికి రక్షణ గోడలను నిర్మించాలని డిసైడ్ అయింది.ఈ 11 రోజుల్లోనే ఆయా పేద, మధ్యతరగతి ప్రజలకు స్థల సేకరణ, ఇళ్ల నిర్మాణంపై డీపీఆర్ తయారీకి ప్రణాళిక రూపొందించనుంది. హౌసింగ్ బోర్డుకు సంబంధించిన రిజిస్ట్రేషన్ సమస్యల పరిష్కారానికి ఏప్రిల్ 5 నుంచి 14 వరకు కేటాయింపుదారులతో కాలనీల వారీగా అధికారులు సమావేశాలను నిర్వహిస్తారు. ఏప్రిల్ 15 నుంచి 23 వరకు గ్రీవెన్స్ కాల్ సెల్‌ను ఏర్పాటు చేస్తారు. ఈ మేరకు ప్రభుత్వం ఎఫర్డబుల్ హౌసింగ్ పాలసీని సిద్ధం చేస్తోంది. ఈ నెలాఖరులోగా మార్గదర్శకాల ముసాయిదాను సర్కార్ రూపొందించనుంది. పాలసీ రూపకల్పనకు 'రిక్వెస్ట్ ఫర్ ప్రపోజల్' ద్వారా ఇప్పటికే సీబీఆర్ఐ కన్సల్టెన్సీ సంస్థను సైతం ఎంపిక చేసింది.తెలంగాణ రైజింగ్ విజన్-2047లో భాగంగా పట్టణ ప్రాంతాల్లో పీపీపీ పద్ధతిలో పేదలు, మధ్యతరగతి వారికి ఇళ్ల నిర్మాణం చేపట్టడానికి సర్కార్ ఏర్పాట్లు చేస్తోంది. మొత్తం మూడు దశల్లో ఈ ఇళ్ల సముదాయాలను నిర్మించనున్నట్లు అధికారులు వెల్లడించారు. హైదరాబాద్ ఫోర్త్ సిటీలోనూ పెద్దఎత్తున గృహ సముదాయాల నిర్మాణాన్ని చేపట్టనుంది. హైదరాబాద్‌తోపాటు రాష్ట్రంలోని ఇతర నగరాల్లోనూ తక్కువ ఆదాయ, మధ్య తరగతి పరిధిలోకి వచ్చే జనాభా ఎక్కువగా ఉంటున్నారు. వీరికి కూడా సొంత ఇల్లు కొనుక్కోవాలనే కోరిక ఉన్నప్పటికీ.. అక్కడ కూడా ధరలు భారీగా పెరిగిపోవడంతో అద్దె ఇళ్లలోనే నివాసం ఉంటున్నారు. అందుబాటు ధరలో ఇళ్లు, ఫ్లాట్ల ఉంటే వీరి సొంతింటి కలను నిజం చేసుకోవచ్చు.ఈ మేరకు టైర్ -2 పట్టణాల్లోనూ ఇళ్ల టవర్లను

# రైతుల ఉసురు తెలంగాణ రాజకీయాలను మలుపు తిప్పేనా?

**అగ్ని ధార వనపర్తి జిల్లా :** తెలంగాణ రాజకీయాల్లో రైతుల పాత్ర ఎప్పటికీ కీలకం. పంటలు పండించే రైతు చేతిలోనే నాయకుల భవిష్యత్తు కూడా ఉంటుంది. గతంలో ఎన్నో ప్రభుత్వాలు రైతుల ఆశలు నెరవేర్చడం వల్ల బలపడ్డాయి, మరికొన్ని రైతుల అసంతృప్తి వల్లే కూలిపోయాయి. ప్రస్తుతం రాష్ట్రంలో కూడా రైతుల మనసులో ఏం జరుగుతోంది అన్న ప్రశ్న మళ్లీ రాజకీయ వేదికపై చర్చనీయాంశంగా మారింది.ప్రస్తుతం రాష్ట్రాన్ని నడిపిస్తున్న రేవంత్ రెడ్డి ప్రభుత్వంపై రైతుల్లో మిశ్రమ అభిప్రాయాలు కనిపిస్తున్నాయి. ఎన్నికల సమయంలో రైతులకు ఇచ్చిన హామీలు---ప్రత్యేకంగా రుణమాఫీ, రైతు సంక్షేమ పథకాలు, మహిళలకు ఇచ్చిన గ్యారంటీలు---పూర్తిగా అమలు కాలేదని కొంతమంది విమర్శిస్తున్నారు. గ్రామాల్లో అభివృద్ధి పనులు వేగంగా జరగడం లేదని కూడా కొన్ని వర్గాలు అంటున్నాయి.ఇదే సమయంలో గత ప్రభుత్వ కాలం కూడా రాజకీయ చర్చల్లో తరచూ ప్రస్తావనకు వస్తోంది. ముఖ్యంగా కే.చంద్రశేఖర్ రావు ప్రవేశపెట్టిన రైతు సంక్షేమ పథకాలు---ప్రత్యేకించి రైతుబంధు---రైతు కుటుంబాలకు ఆర్థిక భరోసా ఇచ్చాయని అనేక మంది గుర్తుచేస్తున్నారు. ఈ పథకం రైతులకు నేరుగా ఆర్థిక సహాయం అందించడంతో గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు కొంత బలం చేకూరిందని విశ్లేషకులు చెబుతున్నారు.రైతు సంక్షేమం గురించి మాట్లాడితే, గతంలో రైతు నాయకత్వానికి ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న నాయకుల్లో వై . ఎస్ రాజశేఖర్ రెడ్డి కూడా ఒకరు. ఆయన కాలంలో అమలు చేసిన ఉచిత విద్యుత్, సాగునీటి ప్రాజెక్టులు రైతు రాజకీయాల్లో ఒక మైలురాయిగా నిలిచాయని చాలామంది భావిస్తున్నారు. తెలంగాణలో కూడా రైతుల ఆశలు అలాంటి స్థాయిలో నెరవేరాలని ప్రజలు కోరుకుంటున్నారు.ఇప్పుడు పెద్ద ప్రశ్న ఏమిటంటే---రాబోయే ఎన్నికల్లో రైతులు ఏ దిశగా వెళ్లబోతున్నారు?ప్రభుత్వానికి మద్దతు ఇస్తారా? లేక అసంతృప్తిని తిరుగుబాటుగా చూపిస్తారా?సామాజిక పరిశీలకుల అభిప్రాయం ప్రకారం, రైతు అసంతృప్తి ఒక్కరోజులో బయటపడదు. అది గ్రామాల్లో నెమ్మదిగా పెరిగి




చివరికి ఎన్నికల సమయంలో పెద్ద ప్రభావాన్ని చూపిస్తుంది. అదే సమయంలో ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేస్తే ప్రజల్లో విశ్వాసం మళ్లీ పెరిగే అవకాశమూ ఉంటుంది.

ఇంకొక ముఖ్యమైన అంశం రాజకీయ సంస్కృతి. ఎన్నికల సమయంలో నాయకులు ప్రజల ముందుకు వచ్చి వినమ్రంగా ఓట్లు అడుగుతారు. కానీ గెలిచిన తర్వాత ప్రజల సమస్యలు పరిష్కరించడంలో అదే ఉత్సాహం కనిపించకపోతే అసంతృప్తి పెరుగుతుంది. ప్రజలతో నిరంతరం ఉండే నాయకత్వమే నిజమైన ప్రజాస్వామ్యానికి బలం.ప్రజాస్వామ్యంలో చివరికి నిర్ణయం తీసుకునేది ప్రజలే. కేవలం పార్టీలు, కులాలు, ప్రచారం ఆధారంగా కాకుండా నాయకుడి నిజాయితీ, సేవా చరిత్ర, ప్రజల పట్ల నిబద్ధత ఆధారంగా ఓటు వేయాలని సామాజికవేత్తలుసూచిస్తున్నారు.రైతు బలంగా ఉంటే దేశం బలంగా ఉంటుంది. రైతు సంతోషంగా ఉంటే ప్రభుత్వాలు బలపడతాయి. రైతు అసంతృప్తిగా ఉంటే రాజకీయాల్లో మార్పులు అనివార్యం అవుతాయి.అందుకే తెలంగాణ రాజకీయాల్లో ఇప్పుడు ఒక ప్రశ్న గట్టిగా వినిపిస్తోంది ---

"రైతుల ఉసురు అధికారాన్ని నిలబెడుతుందా... లేక రాజకీయాలను మార్చే గాలిగా మారుతుందా?"

**గంగవరం రామకృష్ణారెడ్డి**
**(సీనియర్ జర్నలిస్ట్ )**

# సావిత్రిబాయి పూలే స్ఫూర్తితో సగభాగం వాటా సాధించాలి

**వరంగల్ బార్ అసోసియేషన్ అధ్యక్షులు వలస సుధీర్**
**సావిత్రిబాయి పూలే కు వరంగల్ బార్ ఘన నివాళులు**

**అగ్నిధారన్యూస్ హనుమకొండ** రెండు వందల ఏండ్ల క్రితమే మహిళా అభ్యున్నతికి విద్య నేర్పడంతో పాటు, సామాజిక రుగ్మతలను రూపుమాపి అవనిలో సగమైన మహిళా సమాజం గౌరవంగా బ్రతకడం కోసం మాతా సావిత్రిబాయి పూలే చేసిన త్యాగపూరిత పోరాట స్ఫూర్తితో మహిళా న్యాయవాదులతో పాటు సమాజం అన్నిటిలో సగభాగం వాటా సాధించాలని వరంగల్ బార్ అసోసియేషన్ అధ్యక్షులు వలస సుధీర్ అన్నారు. హనుమకొండ జిల్లా కేంద్రంలో వరంగల్, హనుమకొండ బార్ అసోసియేషన్ల సంయుక్త కార్యదర్శులు రేవూరి శశిరేఖ, రేణిగుంట నాగేంద్రల అధ్యక్షతన సావిత్రిబాయి పూలే హాల్ లో మంగళవారం జరిగిన సావిత్రిబాయి పూలే 129 వ వర్ధంతి సభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై సావిత్రిబాయి చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించి మాట్లాడారు. ఆధిపత్య వర్గాల అఘాయిత్యాలు కొనసాగుతున్న 200 ఏండ్ల క్రితమే మహిళా అభ్యున్నతికి కృషి చేసిన పూలే దంపతులను స్ఫూర్తిగా తీసుకొని అంబేద్కర్ రాజ్యాంగంలో మహిళా అభివృద్ధికి ఎన్నో హక్కులను కల్పించాడని ఆ హక్కుల ద్వారా మరింత చైతన్యమై ఐక్యతతో న్యాయ వ్యవస్థలో మహిళలు రాణించాలని ఆయన పిలుపునిచ్చారు. వరంగల్,





హనుమకొండ బార్ అసోసియేషన్ మహిళా సంయుక్త కార్యదర్శులు రేవూరి శశిరేఖ, రేణిగుంట నాగేంద్ర మాట్లాడుతూ సావిత్రిబాయి పూలే మొదలుకొని ఎందరో త్యాగపలంగా మహిళలకు విద్యతో పాటు ఎన్నో హక్కులు కల్పించబడ్డాయని, అయినా కూడా ప్రజాస్వామ్యంలో కీలకపాత్ర పోషించే న్యాయవ్యవస్థలో రూల్ ఆఫ్ రిజర్వేషన్ లేదని, ఆయా పదవుల్లో మహిళలకు దక్కాల్సిన వాటా దక్కకపోవడం బాధాకరమని అన్నారు. బార్ కౌన్సిల్, బార్ అసోసియేషన్ లలో వాటా సాధించినట్లే ప్రభుత్వం నియమించే జి.పి, ఎజిపి, పి.పి తదితర టెన్యూర్ పదవుల్లో మహిళా వాటా కోసం ఐక్యంగా పోరాడి సాధించుకున్నపుడే సావిత్రిబాయికి నిజమైన నివాళి అర్పించనట్లవుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఐ ఎల్ పి ఎ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సాయిని నరేందర్ మాట్లాడుతూ మహిళా న్యాయవాదులు ఐక్యంగా పోరాడి న్యాయవాద రక్షణ చట్టం, అడ్వకేట్ అకాడమీ సాధించుకోవాలని, న్యాయవాద వృత్తిలో నమోదు చేసుకున్న మహిళ న్యాయవాదులకు స్త్రీ, శిశు సంక్షేమ శాఖ స్టైఫండ్ ఇవ్వాలని అన్నారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ నాయకులు మైదం జయపాల్, నలిగంటి శివప్రసాద్, కె నిర్మలా జ్యోతి, మహేందర్, తోట అరుణ, కొక్కొండ రమేష్, ఐ ఎల్ పి ఎ నాయకులు సాయిని నరేందర్, విలాసాగరం సురేందర్ గౌడ్, జన్ను పద్మ, న్యాయవాదులు గోపిక రాణి, పద్మలత గౌడ్, జలజ, సిరిమల్ల అరుణ, లలిత కుమారి, రత్న మంజుల, శ్రీలత, గంధం శివ, ఐత ప్రసాద్, నాగేంద్రచారి, నరసింగరావు, పద్మ యాదవ్, సరిత, సుకన్య, దీప, వీణ, జయశ్రీ, శృతి, ప్రవీణ, అనిత, సౌందర్య, అంజలి, కవిత తదితరులు పాల్గొని సావిత్రిబాయి చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు.

# పాత పాఠశాల భవనం ప్రమాద సంకేతం... పెచ్చులు ఊడి విద్యార్థులకు గాయాలు

**అగ్నిధార న్యూస్మహమ్మదాబాద్:** మహమ్మదాబాద్ మండలం నంచర్ల మండల కేంద్ర ప్రాథమిక పాఠశాలలో పాత భవనం కారణంగా ప్రమాదం తృటిలో తప్పింది. మంగళవారం రెండో తరగతి గదిలో పైకప్పు నుంచి పెచ్చులు ఊడి ముగ్గురు విద్యార్థులకు గాయాలు కావడంతో గ్రామంలో ఆందోళన నెలకొంది. 1993లో నిర్మించిన ఈ పాఠశాల భవనానికి ప్రస్తుతం 33 సంవత్సరాలు పూర్తయ్యాయి. గదులు పాతబడిన నేపథ్యంలో తరగతి గదిలో చదువుతున్న సమయంలో ఒక్కసారిగా స్లాబ్ పెచ్చులు ఊడి కిందపడడంతో అక్షిత, హర్షిత, విష్ణువర్ధన్ అనే విద్యార్థులకు తలపై గాయాలు అయ్యాయి. వెంటనే ఉపాధ్యాయులు వారికి





ప్రథమ చికిత్స అందించారు.

సమాచారం అందుకున్న జిల్లా విద్యాధికారి ప్రవీణ్ కుమార్ పాఠశాలను సందర్శించి పరిస్థితిని పరిశీలించారు. ప్రమాదం జరిగిన గదిలో విద్యార్థులను కూర్చోబెట్టవద్దని ఆదేశిస్తూ, మిగతా గదులు మరియు సమీప హైస్కూల్ గదులను తాత్కాలికంగా వినియోగించుకోవాలని సూచించారు. అలాగే ఇంజనీర్లతో భవనాన్ని పరిశీలించి అవసరమైన మరమ్మత్తులు చేపట్టాలని తెలిపారు. ఈ సందర్భంగా ఏఎంఓ డి శ్రీనివాస్, ఎంఎన్ఓ సురేందర్ రెడ్డి,పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు రేణుక దేవి ,గ్రామ సర్పంచ్ ఎస్. గాయత్రీ దేవి, డిప్యూటీ సర్పంచ్ సుమిత్ర లక్ష్మణ్, మహబూబ్నగర్ జిల్లా బీసీ విద్యార్థి సంఘం అధ్యక్షులు దోమ వెంకటేష్,జె. వీరాజి, బి.రాజ్ కుమార్, గ్రామస్తులు పాల్గొన్నారు.

## అక్షరజ్యోతి సావిత్రిబాయి పూలేకు ఘన నివాళి



**మహిళా విద్యకు ఆద్యురాలు: దుర్గం ప్రమీల నగేశ్**

**అగ్ని ధార న్యూస్,( రామగుండం):** భారతదేశ సామాజిక చరిత్రలో అక్షరజ్యోతిగా నిలిచిన మహనీయురాలు సావిత్రిబాయి పూలే అని సమతా సైనిక దళ్ రాష్ట్ర నాయకులు, సమతా ఫౌండేషన్ , సమతా గ్రంథాలయ నిర్వాహకులు దుర్గం ప్రమీల నగేశ్ పేర్కొన్నారు. మంగళవారం సావిత్రిబాయి పూలే వర్ధంతి సందర్భంగా సమతా సైనిక దళ్ ఆధ్వర్యంలో స్థానిక అన్నపూర్ణ కాలనీలోని సమతా గ్రంథాలయంలో ఆమె చిత్రపటానికి పూలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా దుర్గం ప్రమీల నగేశ్ మాట్లాడుతూ మహిళా విద్యకు పునాది వేసి సమాజంలో మార్పు తీసుకొచ్చిన గొప్ప సంస్కర్తగా సావిత్రిబాయి పూలే నిలిచారని అన్నారు. అణగారిన వర్గాలు, మహిళలకు విద్య హక్కు కల్పించేందుకు ఆమె చేసిన కృషి అపారమని తెలిపారు. సమాజంలో ఉన్న కులవివక్ష, మహిళలపై జరుగుతున్న అన్యాయాలకు వ్యతిరేకంగా ఆమె నిరంతరం పోరాడారని పేర్కొన్నారు. తన భర్త జ్యోతిరావు పూలేతో కలిసి బాలికల విద్యాభివృద్ధికి అహర్నిశలు కృషి చేసి పుణెలో తొలి బాలికల పాఠశాలను స్థాపించి మహిళా విద్యకు మార్గం చూపారని అన్నారు. మహిళలు విద్యావంతులు అయితేనే సమాజం అభివృద్ధి చెందుతుందని సావిత్రిబాయి పూలే చూపిన మార్గం నేటి తరానికి ఆదర్శమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సమతా సైనిక దళ్ పెద్దపల్లి జిల్లా నాయకులు చీమల ఆనంద్, జిమ్మిడి అశోక్, శాంతికుమార్, గూడూరు లవన్ కుమార్, గన్న మహేష్, బెక్కం నిఖిల్ సాయి, రామటెంకి విశ్వనాథ ప్రతాప్, దుర్గం వెంకటనరసయ్య తదితరులు పాల్గొన్నారు.

## జనగామలో ఉచిత మెడికల్ క్యాంప్ ప్రారంభం



**అగ్నిధార న్యూస్ ,(రామగుండం):** రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని జనగామలో అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్లో నిర్వహించిన ఉచిత మెడికల్ క్యాంప్‌ను ఆరవ డివిజన్ కార్పొరేటర్ ఆవుల తోకల శ్యామనిరమేశ్ మంగళవారం ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ఉచిత వైద్య శిబిరాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రజల అనారోగ్య సమస్యలను గుర్తించి తక్షణ చికిత్స అందించేందుకు ప్రభుత్వం ప్రత్యేక వైద్యులను పంపించడం శుభ పరిణామమని పేర్కొన్నారు.

ఈ మెడికల్ క్యాంప్‌లో గైనకాలజిస్ట్, పీడియాట్రిషన్, ఆఫ్తాల్మాలజిస్ట్, ఆర్థోపెడిక్, డెంటల్ వైద్యులతో పాటు సాధారణ వైద్యులు రోగులను పరీక్షించి అవసరమైన మందులను అందజేశారు. పేద, మధ్యతరగతి ప్రజలకు ఒకే చోట వివిధ విభాగాలకు చెందిన వైద్యుల సేవలు అందడం ద్వారా మెరుగైన ఉచిత వైద్యం లభిస్తుందని ఆమె తెలిపారు.క్యాంప్‌లో నిపుణులైన వైద్యులు, పారామెడికల్ సిబ్బంది పాల్గొని ప్రజలకు సేవలు అందించారు.

## గ్యాస్ ధరలు వెంటనే తగ్గించాలి




**ప్రజలపై భారాన్ని మోపే విధానాలు ఉపసంహరించుకోవాలి**
**: కోడిపుంజుల లక్ష్మి**

**అగ్ని ధార న్యూస్,(రామగుండం):** కేంద్ర ప్రభుత్వం పెంచిన వంట గ్యాస్ ధరలను వెంటనే తగ్గించాలని ప్రగతిశీల మహిళా సంఘం (పీవోడబ్ల్యూ) రాష్ట్ర నాయకురాలు కోడిపుంజుల లక్ష్మి డిమాండ్ చేశారు. మంగళవారం గోదావరిఖనిలో ప్రగతిశీల మహిళా సంఘం ఆధ్వర్యంలో గ్యాస్ ధరల పెంపును నిరసిస్తూ ఆందోళన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా లక్ష్మి మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే జీఎస్టీతో పాటు నిత్యావసర వస్తువుల ధరలను పెంచుతూ ప్రజలపై మోయలేని భారాన్ని మోపుతోందని విమర్శించారు. వంట నూనెల ధరలు ఇప్పటికే పెరిగి ప్రజలు ఇబ్బందులు పడుతున్న సమయంలో గ్యాస్ ధరలను కూడా విపరీతంగా పెంచడం అన్యాయమని పేర్కొన్నారు. యుద్ధ పరిస్థితులను సాకుగా చూపిస్తూ అంతర్జాతీయ చమురు మార్కెట్‌తో సంబంధం లేకుండా దేశంలో గ్యాస్ ధరలను పెంచుతున్నారని ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వం ప్రజల ప్రయోజనాలను పక్కనబెట్టి కార్పొరేట్ అనుకూల విధానాలు అమలు చేస్తోందని విమర్శించారు. పెరుగుతున్న నిత్యావసర వస్తువుల ధరలు, గ్యాస్ ధరలను తగ్గించే వరకు ప్రజలు ఉద్యమించాల్సిన అవసరం ఉందని పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో ప్రగతిశీల మహిళా సంఘం జిల్లా నాయకురాలు, పెద్దంపేట మాజీ సర్పంచ్ మార్త రాద, పెండ్యాల లక్ష్మి, మంద సత్తక్క, స్వరూప, అంజక్క తదితరులు పాల్గొన్నారు.

## ఉద్యోగాల కోత వార్తలు అవాస్తవం

భారీగా ఉద్యోగాల కోత విధిస్తున్నట్లు వచ్చిన వార్తలను ఐటీ దిగ్గజం టెక్ మహీంద్రా తోసిపుచ్చింది. ఉద్యోగులను తొలగించే ప్రతిపాదనేదీ పరిశీలనలో లేదని స్పష్టం చేసింది. ఇటీవల సోషల్ మీడియా పోస్ట్‌లు, వాటాదార్ల నుంచి వస్తున్న ప్రశ్నల నేపథ్యంలో కంపెనీ ఈ వివరణ ఇచ్చింది. 'నమోదిత కంపెనీల వెల్లడి నిబంధనలన్నీ' పాటిస్తున్నామని, కార్యకలాపాల స్థిరత్వానికి కట్టుబడి ఉన్నామని టెక్ మహీంద్రా వివరించింది. మూడేళ్ల క్రితం కొత్త నాయకత్వం రూపొందించిన వ్యూహం వల్ల టెక్ మహీంద్రా వేగవంతమైన, స్థిరమైన వృద్ధి దిశగా అడుగులు వేస్తోందని, సంస్థ నిర్వహణ మార్జిన్, భారీ ఒప్పందాల పెరుగుదలకు ఇది నిదర్శనమని కంపెనీ సీఈఓ, ఎండీ మోహిత్ జోషి పేర్కొన్నారు. గత ఏడాది డిసెంబరు త్రైమాసికంలో కంపెనీ ఉద్యోగుల సంఖ్య 3098 తగ్గి 1,49,616కు చేరింది.

# ప్రజా ప్రభుత్వం ద్వారా అభివృద్ధి పనులకు సోపానం

**99 రోజుల ప్రజా పాలన - కార్యక్రమాన్ని ప్రజలు సద్వి నియోగం చేసుకోవాలి**

**ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి**

**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)** తలకొండ పల్లి మండలం లోని గట్టుప్పలపల్లి గ్రామము లో ప్రజా ప్రభుత్వం ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా వైద్య శిబిరాలను ప్రారంభించిన, ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి ఈ సందర్భంగా ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి మాట్లాడుతూ ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల యాక్షన్ ప్లాన్ గా 5 దశల్లో 5 ప్రత్యేక కార్యక్రమాలు 99 రోజులు జరుగుతాయని తెలిపారు. త్వరలోనే తలకొండపల్లి మండల కేంద్రానికి 30 పడకల ఆసుపత్రి మంజూరు చేయడం జరుగుతుంది అని చెప్పడం జరిగింది.మరియు మండలానికి రెండు తెలంగాణ పబ్లిక్ స్కూల్స్ మంజూరు చేయిస్తున్నాను అని చెప్పినారు రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే పరిశుభ్రత ,ఆరోగ్యం, యువత, క్రీడలు విద్య ,పిల్లల భద్రత, డ్రగ్స్ కు అడ్డుకట్ట, రైతు సంక్షేమం, వ్యవసాయం, మహిళలు , పర్యావరణం వంటి కీలక అంశాలపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టితో ప్రగతి వైపు అడుగులు వేస్తుందని అన్నారు. మండలంలో నిర్మిస్తున్న ఇంటిగ్రేడ్ పాఠశాల పనులను పరిశీలించారు ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమాన్ని ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో జడ్పీ సీఈవో కృష్ణారెడ్డి డిప్యూటీ డీఎంహెచ్వో, ఎమ్మార్వో ఎంపీడీవో డాక్టర్లు సైదమ్మ, స్నేహ, స్థానిక సర్పంచులు జనుకుంట చంద్రశేఖర్ కటికల శేఖర్ యాదవ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు యట నరసింహ ముదిరాజ్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ గూడూరు భాస్కర్ రెడ్డి, తలకొండపల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు డోకూరి ప్రభాకర్ రెడ్డి, వివిధ గ్రామాల సర్పంచులు మార్కెట్ డైరెక్టర్లు వెంకట్ రెడ్డి, ఎండి అజీమ్, మాజీ ఎంపీపీ లక్ష్మీదేవి రఘు రాములు, మాజీ వైస్ ఎంపీపీ ఎం శ్రీనివాస్ రెడ్డి, , మాజీ సర్పంచ్ పి రమేష్ యాదవ్, బండి రఘుపతి, మాజీ ఎంపీటీసీ యాదయ్య, డిసిసి కార్యదర్శి రవీందర్ యాదవ్, ఎస్సీ సెల్ అధ్యక్షులు మిద్ద చెన్నకేశవులు,





నాయకులు డేవిడ్, రేణు రెడ్డి,రాజా శేఖర్,పోల శ్రీను, పి అశోక్ బాబు, బి నర్సింలు అజీజ్, నరసింహారెడ్డి, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఇంద్రకంటి శివకుమార్ గౌడ్, యువ నాయకులు సభవత్ రాజేందర్ నాయక్, పవన్ వాల్మీకి,టి.ప్రదీప్ రెడ్డి, ఇటామోని మల్లేష్ పుల్లల విష్ణు తదితరులు పాల్గొన్నారు.

# ఆరోగ్యం కోసం 2కే రన్.....

**మున్సిపల్ చైర్మన్ బిరుదు రాధాకృష్ణ.**

**అగ్నిధారన్యూస్ సుల్తానాబాద్,:** ప్రజల్లో ఆరోగ్య చైతన్యం కోసం 2కే రన్ నిర్వహించడం జరిగిందని మున్సిపల్ చైర్మన్ బిరుదు రాధాకృష్ణ అన్నారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా ప్రజల్లో ఆరోగ్యంపై అవగాహన పెంపొందించేందుకు సుల్తానాబాద్ మున్సిపాలిటీ ఆధ్వర్యంలో పట్టణంలో 2కే రన్ కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమాన్ని మున్సిపల్ చైర్మన్ బిరుదు రాధాకృష్ణ జెండా ఊపి ప్రారంభించారు. పట్టణంలోని విద్యార్థులు, యువకులు, మహిళలు, వాకర్స్ అసోసియేషన్ సభ్యులు ఉత్సాహంగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ మాట్లాడుతూ ఆరోగ్యం మనిషికి అత్యంత విలువైన సంపద అని పేర్కొన్నారు. నిత్యం వ్యాయామం చేయడం, నడక అలవాటు చేసుకోవడం ద్వారా శారీరకంగా,మానసికంగా ఆరోగ్యంగా ఉండవచ్చని అన్నారు. ప్రజలు ఆరోగ్యంపై శ్రద్ధ చూపుతూ ఇటువంటి కార్యక్రమాల్లో పాల్గొనాలని సూచించారు. పట్టణంలోని శాస్త్రీయ నగర్ మెయిన్ రోడ్డు నుండి ప్రభుత్వ జూనియర్ కళాశాల



మైదానం వరకు సాగిన ఈ 2కే రన్ కార్యక్రమం ప్రజల్లో మంచి స్పందన లభించింది. ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ శారీరక దారుఢ్యాన్ని పెంపొందించుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ అంతటి పుష్పలత,మున్సిపల్ కమిషనర్ రమేష్, స్పోర్ట్స్ క్లబ్ అధ్యక్షులు ముస్త్యాల రవీందర్, కార్యదర్శి అమీర్ శెట్టి తిరుపతి,సీఐ సుబ్బారెడ్డి, ఎస్సై చంద్రకుమార్, ఎంఈఓ రాజయ్య, వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షులు ఐల రమేష్,కందుకూరి ప్రకాష్ రావు,కౌన్సిలర్లు, అధికారులు, క్రీడాకారులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ ఆసుపత్రిలో లాప్రోస్కోపిక్ సర్జరీలు





**వివరాలు వెల్లడించిన హాస్పిటల్ సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీధర్.**

**అగ్నిధారన్యూస్ (పెద్దపల్లి హాస్పిటల్)** మంగళవారంపెద్దపల్లి మండలం బొంపల్లి గ్రామానికి చెందిన 30 సంవత్సరాల ఒక మహిళ తీవ్రమైన కుడివైపు కడుపునొప్పితో బాధపడుతూ పెద్దపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి రావడం జరిగింది. పెద్దపల్లి ప్రభుత్వ ఆసుపత్రిలో పరీక్షలు చేసుకోగా గాల్ బ్లాడర్ నెక్ లో స్టోన్ ఉంది అని వైద్యులు కనుక్కున్నారు. మంచిర్యాల కి చెందిన 40 సంవత్సరాల ఒక వ్యక్తి కుడివైపు కడుపునొప్పితో బాధపడుతూ నెల క్రితం పెద్దపల్లి ప్రభుత్వ ఆసుపత్రిలో పరీక్షలు చేసుకోగా గాల్ బ్లాడర్ నెక్ లో స్టోన్ ఇన్ఫెక్షన్ ఉంది అని కనుక్కోవడం జరిగింది. ఇన్ఫెక్షన్ తగ్గడం కోసం వైద్యులు 3 వారాలు మందులు ఇవ్వడం జరిగింది. ఇన్ఫెక్షన్ తగ్గిన తరువాత మంగళవారం ఇద్దరు పేషెంట్ లకు అధునాతన పద్ధతిలో లాప్రోస్కోపిక్ కోలిసిస్టెక్టమీ ఆపరేషన్ ను విజయవంతంగా నిర్వహించడం జరిగింది అని పెద్దపల్లి ప్రభుత్వ హాస్పిటల్ సూపరింటెండెంట్ శ్రీధర్ తెలిపారు. అదేవిధంగా పెద్దపల్లి కి చెందిన 33 సంవత్సరాల ఒక మహిళ తీవ్రమైన కడుపునొప్పితో బాధపడుతూ పెద్దపల్లి ప్రభుత్వ ఆసుపత్రిలో పరీక్షలు చేసుకోగా గర్భాశయం రెండు భాగాలుగా ఉండడం గమనించారు. ఒక భాగంలో అటు వైపు గర్భాశయ నాళం లో ఎన్డోమెట్రియోసిస్ అనే వ్యాధి ఉందని గుర్తించి చెడిపోయిన భాగాన్ని తొలగించడం జరిగింది. ఇట్టి సర్జరీల లో పాల్గొన్న వైద్యుల బృందం లాప్రోస్కోప్ సర్జన్ డాక్టర్ అమర సింహా రెడ్డి, జనరల్ సర్జన్ డాక్టర్ సాయి ప్రసాద్, డాక్టర్ స్వాతి, డాక్టర్ రామమం, డాక్టర్ భవాని. ఈ మూడు సర్జరీలు చేసిన వైద్య బృందాలను ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కె. శ్రీధర్ ప్రత్యేకంగా అభినందించారు. ప్రజలందరూ పెద్దపల్లి ప్రభుత్వ ఆసుపత్రిలో అందుతున్న నవజాత శిశు కేంద్రం సేవలు, 2 డి ఎకో సేవలు, ఆధునిక పరిజ్ఞానంతో కూడిన లాప్రోస్కోపిక్ శస్త్ర చికిత్సలు, యూరాలజీ సేవలు రూట్ కెనాల్ సేవలను ఉపయోగించుకోవాలని, ఈ సేవలలో ఏవైనా ఇబ్బందులు ఎదురైనచో నేరుగా తనను కలవచ్చు అని ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కె. శ్రీధర్ తెలిపారు. హాస్పిటల్ కి సంబంధించిన ఇంకేమైనా ఫిర్యాదులు ఉన్నట్లయితే కంప్లైంట్ బాక్స్ లో ఇవ్వవచ్చు, వారి సమస్యని వెంటనే పరిష్కారం చేయడానికి ప్రయత్నం చేస్తా అన్నారు.

## సమతా సైనిక దళ్ ఘనంగా గన్న మహేష్ జన్మదిన వేడుకలు



**రక్తదానం చేసి సేవాభావం చాటిన మహేష్**

**అగ్ని ధార న్యూస్,(రామగుండం)** సమతా సైనిక దళ్, సమతా ఫౌండేషన్ ఆధ్వర్యంలో సమతా ఫౌండేషన్ సభ్యుడు గన్న మహేష్ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. స్థానిక సమతా గ్రంథాలయంలో జరిగిన కార్యక్రమంలో సమతా సైనిక దళ్ తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షులు డా. మార్షల్ దుర్గం నగేష్ మహేష్ చేత కేక్ కట్ చేయించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

ఈ సందర్భంగా డా, నగేష్ మాట్లాడుతూ గన్న మహేష్ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో దీర్ఘాయుష్షుతో జీవిస్తూ ప్రజాసేవలో ముందుండాలని ఆకాంక్షించారు. సమాజానికి సేవ చేసే యువత ముందుకు రావాలని పిలుపునిచ్చారు. అంతకుముందు తన జన్మదినాన్ని పురస్కరించుకుని మహేష్ గోదావరిఖని ప్రభుత్వ ఆసుపత్రిలో రక్తదానం చేసి సేవాభావాన్ని చాటుకున్నారు. ఈ కార్యక్రమంలో దుర్గం ప్రమీల నగేష్, చీమల ఆనంద్, జిమ్మిడి అశోక్, గూడూరు లవన్ కుమార్, శాంతి కుమార్, రామటెంకి విశ్వనాథ ప్రతాప్, బెక్కం నిఖిల్ సాయి తదితరులు పాల్గొన్నారు.

## 84 మిలియన్ మార్చ్ ను గుర్తు చేసుకొన్న కేటీఆర్

**ట్యాంక్బండ్పై లక్షల గొంతుకలు గర్జించాయని పోస్టులో పేర్కొన్న కేటీఆర్**

తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర సాధన ఉద్యమంలో కీలక ఘట్టమైన 'మిలియన్ మార్చ్'కు నేటితో 15 సంవత్సరాలు పూర్తయ్యాయి. ఈ చారిత్రక సందర్భాన్ని పురస్కరించుకుని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, ఆనాటి ఉద్యమ స్ఫూర్తిని గుర్తుచేసుకున్నారు. తెలంగాణ ఉద్యమాన్ని ఉవ్వెత్తున ఎగసేలా చేసిన అద్భుత పోరాట రూపాల్లో ఇదొకటని ఆయన పేర్కొన్నారు.ఆయన 'ఎక్స్' వేదికగా స్పందిస్తూ.. 2011 మార్చి 10న జరిగిన మిలియన్ మార్చ్ను స్మరించుకున్నారు. "స్వరాష్ట్ర సాధన కోసం ట్యాంక్బండ్పై యావత్ తెలంగాణ ప్రజలు ఏకమై గర్జించి నేటికి 15 ఏళ్లునిర్బంధాలు, దిగ్బంధాలు, అడ్డంకులు, బ్యారికేడ్లు, ఇనుపకంచెలు ఏవీ తెలంగాణ ఉద్యమకారుల స్ఫూర్తిని దెబ్బతీయలేకపోయాయి" అని కేటీఆర్ తన పోస్టులో రాసుకొచ్చారు. స్వరాష్ట్రం కోసం లక్షల గొంతుకలు

## దశ దిన కర్మ కార్యక్రమంలో పాల్గొన్న సుంకిరెడ్డి



**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)** ఆమనగల్ మండలం పోలేపల్లి గ్రామానికి చెందిన విశ్రాంత పి ఈ టి కీర్తిశేషులు కల్లు శ్రీధర్ రెడ్డి ద్వాదశ దినకర్మ కార్యక్రమం హైదరాబాద్లోని ఒక ప్రముఖ హోటల్లో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఐక్యత ఫౌండేషన్ చైర్మన్, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు, టాస్క్ సి ఓ ఓ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి ఈ సందర్భంగా కీ.శే.శ్రీధర్ రెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించిన, అనంతరం వారి కుటుంబ సభ్యులను పరామర్శించి వారికి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పోలేపల్లి ఉప సర్పంచ్ బుచ్చిరెడ్డి, సీనియర్ నాయకులు సుక్జీవన్ రెడ్డి, శ్రీకాంత్ రెడ్డి లతో పాటు తదితరులు పాల్గొన్నారు.

## సర్పంచ్ డోకూరి సునీత ప్రభాకర్ రెడ్డి ఆధ్వర్యంలో ప్రగతి ప్రణాళిక



**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)** తలకొండపల్లి మండలం పడకల్ గ్రామంలో 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక సర్పంచ్ సునీత ప్రభాకర్ రెడ్డి ఆధ్వర్యంలో గ్రామంలో పచ్చదనం పరిశుభ్రత కార్యక్రమం నిర్వహించి ప్రభుత్వ పాఠశాలలో, గ్రామంలోని డ్రైనేజీలు పరిశుభ్రంగా చేసే కార్యక్రమం నిర్వహించి బ్లీచింగ్ పౌడర్, శానిటేషన్, చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్ జీనుకుంట్ల రాఘవేందర్ గౌడ్, పంచాయతీ కార్యదర్శి కుమార్, వార్డు సభ్యులు జోగు విజయ్, జిల్లెల్ల సువాసిని, లట్టుపల్లి వసంత రంగారెడ్డి , అబ్దుల్ వహీద్, రాధిక రమేష్, బండ గళ్ళ చందు, చెవిటి విమలమ్మ, జనిగేనరసింహ, చెవిటి విజయకుమార్, గ్రామ ప్రజలు మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## పడకల్ గ్రామంలో అండర్ డ్రైనేజీ పనులు ప్రారంభం



**గ్రామాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి పథంలో నడిపిస్తా**

**సర్పంచ్ డోకూరి సునీత ప్రభాకర్ రెడ్డి**

**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)** తలకొండపల్లి మండలంలోని పడకల్ గ్రామంలో గ్రామ అభివృద్ధి లో భాగంగా శివాలయం నుండి యాదవ సంఘం వరకు అండర్ డ్రైనేజీ పనులు ప్రారంభించిన సర్పంచ్ డోకూరి సునీత ప్రభాకర్ రెడ్డి ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఎంపీ మల్లురవి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి సహకారంతో గ్రామాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి పథంలో నడిపిస్త అని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు డోకూరి ప్రభాకర్ రెడ్డి, ఉప సర్పంచ్ రాఘవేందర్ గౌడ్, పంచాయతీ కార్యదర్శి కుమార్,వార్డు సభ్యులు గ్రామ ప్రజలు యువకులు పాల్గొనడం జరిగింది

## ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక లో భాగంగా పలు అభివృద్ధి కార్యక్రమాలు



**సర్పంచ్ మట్ట యాదమ్మ వెంకటయ్యగౌడ్**

**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)** వెల్దండ మండల కేంద్రంలో నీ ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల లో భాగంగా 5 వ రోజు గ్రామంలో అంతర్గత రహదారులు శుభ్రం చేయడం జరిగింది. మురికి కాలువలు శుభ్రం చేయుట, తడి ప్రదేశాలలో బ్లీచింగ్ చల్లుట మరియు మురికి కాలువల చివరన ఇంకుడు గుంతలు నిర్మించుటకు ప్రణాళికలు తయారు చేయుటము జరిగింది ఈ సందర్భంగా సర్పంచ్ మట్ట యాదమ్మ వెంకటయ్య గౌడ్ ప్రభుత్వం హాస్పిటల్ లో తనికీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో, ఉప సర్పంచ్ బసన్మోని శ్రీను వార్డు సభ్యులు గోసులు కొండయ్య, పాలది రంగనాథం,జంగలి ఆనంద,రేవల్లి రాజు,మారేపల్లి శ్రీను, ముదికొండ రమేష్, మసిగుండ్ల వెంకటేష్, బాదేపల్లి రమేష్, శేఖర్ , పురుషోత్తం చారి,రాఘవ రెడ్డి, చీముల తిరుపతి రెడ్డి కార్యదర్శి గిరిగౌడ్ ,గ్రామ పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## 91 పార్టీలకు అతీతంగా స్పీకర్ వ్యవహరించాలి : గౌరవ్ గొగొయ్

ఇప్పటి వరకు లోక్ సభలో డిప్యూటీ స్పీకర్ లేరని కాంగ్రెస్ ఎంపి గౌరవ్ గొగొయ్ తెలిపారు. డిప్యూటీ స్పీకర్ లేకుండానే లోక్ సభ నడుస్తోందని అన్నారు. స్పీకర్ ఓం బిర్లాపై విపక్షాల అవిశ్వాస తీర్మానంపై చర్చ జరిగింది.

# ప్రజలకు మెరుగైన సేవలు అందాలి

**జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష.**

**పెద్దపెల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు.**



**అగ్నిధారన్యూస్ కాల్వ శ్రీరాంపూర్, మార్చి 10:-** నూతనంగా ప్రారంభించిన తహసిల్దార్ కార్యాలయం ద్వారా మండల ప్రజలకు మెరుగైన సేవలు వేగవంతంగా అందాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష తెలిపారు మంగళవారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష కాల్వ శ్రీరాంపూర్ మండలంలో 75 లక్షల రూపాయల గ్రాంట్ నిధులతో నూతనంగా నిర్మించిన మండల రెవెన్యూ అధికారి కార్యాలయాన్ని పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు, అదనపు కలెక్టర్ డి.వేణు లతో కలిసి ప్రారంభించారు.

**ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష** మాట్లాడుతూ... కాల్వ శ్రీరాంపూర్ మండలంలో ఎం.ఆర్.ఓ కార్యాలయ నిర్మాణం చాలా రోజులుగా పెండింగ్ లో ఉందని, 75 లక్షల రూపాయలతో అన్ని వసతులతో కూడిన నూతన తహసిల్దార్ కార్యాలయాన్ని నిర్మించుకున్నట్లు కలెక్టర్ తెలిపారు. నూతన కార్యాలయం నుంచి ప్రజలకు మెరుగైన సేవలు అందాలని, వారి సమస్యలు సత్వరపు పరిష్కారం అయ్యే దిశగా అధికారులు కృషి చేయాలని కలెక్టర్ సూచించారు. రెవెన్యూ వ్యవస్థను బలోపేతం చేసే దిశగా ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటుందని కలెక్టర్ తెలిపారు.

రెవెన్యూ గ్రామాలను క్లస్టర్ గా విభజించి ప్రతి క్లస్టర్ కు గ్రామ పరిపాలన అధికారి నియమించామని తెలిపారు.

రెవెన్యూ శాఖకు సంబంధించిన దరఖాస్తులు క్షేత్రస్థాయి పరిశీలన తర్వాత డిస్పోజ్ చేయాల్సి ఉంటుందని , ప్రతి దరఖాస్తు వీలైనంత త్వరగా పరిష్కరించే దిశగా అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు మాట్లాడుతూ... ప్రజలకు సేవలు అందించే రెవెన్యూ శాఖకు మండలంలో మంచి కార్యాలయం ఏర్పాటు చేసుకున్నామని తెలిపారు. 99 రోజుల ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యాచరణలో భాగంగా పెండింగ్ ఫైల్స్ క్లియర్ చేస్తున్నట్లు తెలిపారు. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి రాగానే మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం సౌకర్యం కల్పించామని, ఆరోగ్య శ్రీ పరిమితి 10 లక్షల పెంపు ,నూతన రేషన్ కార్డుల జారీ, ఇందిరమ్మ ఇండ్లు, 200 యూనిట్లు ఉచిత విద్యుత్, 500 రూపాయలకే గ్యాస్ సిలిండర్ సరఫరా, రైతు రుణమాఫీ, సన్న వడ్లకు 500 రూపాయల బోనస్, రైతు భరోసా వంటి అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తున్నట్లు తెలిపారు. పేద రైతులకు ఉన్న భూ హక్కుల సంరక్షణ కోసం భూ భారతి చట్టం ప్రజా ప్రభుత్వం ప్రవేశపెట్టిందని అన్నారు. ఈ కార్యక్రమంలో పెద్దపల్లి రెవెన్యూ డివిజన్ అధికారి బి.గంగయ్య, కాల్వ శ్రీరాంపూర్ తహసిల్దార్ జగదీశ్వర్ రావు, ఎంపిడిఓ రామ్మోహన్ చారి, ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

# చర్చనీయాంశంగా ఎంపీఓ బదిలీ

**అవినీతి ఆరోపణలే బదిలీకి కారణం..**


**రెగ్యులరైజేషన్ విషయంలో చేతివాటం..?**

**డిప్యూటేషన్ పై జిల్లా కార్యాలయానికి బదిలీ**

**ఉత్తర్వులు జారీ చేసిన జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష.**

**అగ్నిధారన్యూస్ పెద్దపల్లి జిల్లా** పెద్దపల్లి జిల్లా కాల్వ శ్రీరాంపూర్ ఎంపీఓ ఆరిఫ్ ను జిల్లా కలెక్టర్ సోమవారం పెద్దపల్లి జిల్లా పంచాయతీ కార్యాలయానికి అటాచ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. కాల్వ శ్రీరాంపూర్ ఎంపీఒగా సూపరింటెండెంట్ కు బాధ్యతలు అప్పగిస్తూ కలెక్టర్ ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. పరిపాలన సౌలభ్యం కోసం డిప్యూటేషన్ ఆదేశాలు జారీ చేయడం జరిగింది అని ఉత్తర్వుల్లో తెలిపారు. ఈ ఉత్తర్వులు తక్షణమే అమలు కావాలని ఆదేశించారు.

ఎంపీఓపై అనేక ఆరోపణలే బదిలీకి కారణమైనట్లు తెలుస్తుంది.



PROCEEDINGS OF THE DISTRICT COLLECTOR (PANCHAYAT WING), PEDDAPALLI.
Present : Sri Koya Sree Harsha, I.A.S.,

Proceedings.No.2189/2025/A1. Dated.10-03-2026.

Sub:- Estt. - MPOs - Deputation of certain Mandal Panchayat Officers in the district on administrative convenience - Orders - Issued.

Ref :- Note approval of the District Collector, Peddapalli dt,09.03.2026.

000

ORDER :

The following orders are issued with immediate effect on administrative convenience as hereunder,

1) Sri Md. Arif Hussain, Mandal Panchayat Officer, MPP Srirampur is hereby deputed to the District Panchayat Office, Peddapalli on administrative convenience till further orders.

2) The Superintendent, O/o. MPDO, MPP Srirampur is hereby kept Full Additional Charge to the post of Mandal Panchayat Officer, MPP Srirampur on administrative convenience till further orders.

Therefore, the individuals are directed to discharge their duties immediately.

The District Panchayat Officer, Peddapalli / Mandal Parishad Development Officer, MPP Srirampur are requested to take further necessary action in the matter accordingly.

[ISSUED UNDER NOTE ORDERS OF THE DISTRICT COLLECTOR (P.W), PEDDAPALLI.]

for District Collector (P.W),
PEDDAPALLI.

To,
The individual concerned.
The Mandal Parishad Development Officer, MPP Srirampur.
The District Panchayat Officer, Peddapalli.

Copy to the Divisional Panchayat Officer, Peddapalli.
Copy to the District Forest Officer, Peddapalli.
Copy to the District Rural Development Officer, DRDA Peddapalli.
Copy to the Chief Executive Officer, ZPP Peddapalli.
Copy to the Additional Collector (LBs), Peddapalli.



**అనేక ఆరోపణలు..**


మంథనిలో ఎంపీఓగా పనిచేసిన సమయంలో ఎంపీఓ ఎండి ఆరిఫ్ హుస్సేన్ పై అనేక ఆరోపణలు వచ్చాయి. పంచాయతీ కార్యదర్శులు వర్సెస్ ఎంపీఓ అన్నంతగా మంథని మండలంలో వివాదం చెలరేగి చిలికి చిలికి గాలి వానగా మారింది. పంచాయతీ కార్యదర్శులు దాదాపు 25 మంది మానసికంగా, ఆర్థికంగా వేధిస్తున్నాడని ఎంపీఓపై అప్పటి కలెక్టర్ ముసమిల్ ఖాన్ కు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. జెడ్పి సీఈవో నరేందర్ ను విచారణ అధికారిగా నియమించి ఎంపీఓపై విచారణ చేపట్టి హైదరాబాద్ పంచాయతీరాజ్ శాఖ ప్రధాన కార్యాలయాకి ఆనాటి కలెక్టర్ సరెండర్ చేశారు. ఎంపీఓపై తీసుకున్న చర్యలు ఏంటి అనే ఉత్తర్వులు రావడంతో, మరో మారు ప్రస్తుత కలెక్టర్ కోయ శ్రీహర్ష అప్పటి డి ఆర్ డి ఏ రవీందర్ ను విచారణ అధికారిగా నియమించి, విచారణ చేపట్టి అనంతరం ఆరిఫ్ హుస్సేన్ జూలపల్లి ఎంపీఓగా నియమించారు.

**మారని తీరు**

ప్రస్తుతం కాల్వ శ్రీరాంపూర్ ఎంపీఓగా విధులు నిర్వహిస్తున్న క్రమంలో గత కొంతకాలంగా ఆర్థికపరమైన ఆరోపణలు ఎదుర్కొంటున్నాడు. పంచాయతీ కార్యదర్శులపై ఒత్తిడి తీసుకువస్తూ నిబంధనలకు విరుద్ధంగా ఉన్న పనులను కూడా చేయాలని ఒత్తిడి పెడుతున్నట్టు ఆరోపణలు ఉన్నాయి. ఈ క్రమంలోనే గత శనివారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష జిల్లాలోని ఎంపీడీవోలకు, ఎంపిఓలకు ప్రజాపాలన కార్యక్రమంపై టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఆ సమయంలో కాల్వ శ్రీరాంపూర్ ఎంపీఓ ఆరిఫ్ హుస్సేన్ మండలంలో వ్యవహరిస్తున్న తీరు పైన ఆరా తీయడం, రెండు రోజులు గడవకముందే ఎంపీఓగా విధుల నుండి తప్పిస్తూ,జిల్లా పంచాయతీ కార్యాలయానికి డిప్యూటేషన్ పై పంపడంతో అసలేం జరిగింది. ఏం జరగబోతుంది అని జిల్లాలో చర్చనీయాంశంగా మారింది... ఎంపీఓపైన మరింత లోతుగా విచారణ చేపట్టి అవకాశం ఉన్నట్లు తెలుస్తుంది. పంచాయతీ కార్యదర్శుల రెగ్యులరైజేషన్ విషయంలో ఎంపీ ఓ వారి నుండి డబ్బులు తీసుకున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేసిన కాపీలో డి ఎఫ్ ఓ, డిఆర్డిఏ, జెడ్పి సీఈవో లకు కలెక్టర్ జారీ చేసిన ఉత్తర్వుల ప్రతులను పంపడం ఇక్కడ చర్చకు తెరలేపింది.

# గ్రేటర్‌లో పట్టు సాధ్యమేనా

**హైదరాబాద్ :** తెలంగాణ రాజకీయాలకు గుండెకాయ వంటి హైదరాబాద్‌లో ఇప్పుడు ముందస్తు రాజకీయ వేడి రాజుకుంది. మొన్నటి వరకు ఒకే గొడుగు కింద ఉన్న గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ ఇప్పుడు మూడు ముక్కలు (హైదరాబాద్, మల్కాజిగిరి, సైబరాబాద్) కావడంతో, పాత సమీకరణాలు చెదిరి కొత్త పొత్తులు, ఎత్తుగడలకు తెరలేచింది. ముఖ్యంగా అధికార కాంగ్రెస్, దూకుడు మీదున్న బీజేపీల మధ్య నలిగిపోతున్న భారత్ రాష్ట్ర సమితి నేతలు ఇప్పుడు తమ రాజకీయ భవిష్యత్తు కోసం పక్కచూపులు చూస్తున్నారు.రాష్ట్ర ప్రభుత్వం ని మూడు వేర్వేరు కార్పొరేషన్లుగా విభజించాలని నిర్ణయించడం ఈ మొత్తం గందరగోళానికి ప్రధాన కారణం. 150 డివిజన్లతో హైదరాబాద్, 74 డివిజన్లతో మాల్కాజిగిరి, 76 డివిజన్లతో సైబరాబాద్ కార్పొరేషన్లు ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం నిర్ణయించింది. మొత్తం డివిజన్ల సంఖ్య 150 నుంచి 300కి పెరగడం, సరిహద్దుల పునర్విభజన జరగడంతో చాలామంది సిట్టింగ్ కార్పొరేటర్లకు తమ పట్టున్న ప్రాంతాలు చేజారుతాయనే భయం పట్టుకుంది. ఈ రీ-ఆర్గనైజేషన్ వల్ల గ్రామీణ ప్రాంతాలు పట్టణ కార్పొరేషన్లలో కలవడంతో ఓటు బ్యాంకు సమీకరణాలు పూర్తిగా మారిపోయాయి.2016 జీహెచ్‌ఎంసీ ఎన్నికల్లో బీఆర్ఎస్ 99 సీట్లు, 2020లో 56 సీట్లకు పరిమితమైంది. ఒకప్పుడు జీహెచ్‌ఎంసీపై తిరుగులేని ఆధిపత్యం చలాయించిన బిఆర్ఎస్ పరిస్థితి రోజురోజుకూ దిగజారుతూ వస్తోంది. 2024 అసెంబ్లీ ఎన్నికల ఫలితాల తర్వాత ఆ పార్టీలో నైతిక స్థైర్యం దెబ్బతింది.ఈ తరుణంలో కాంగ్రెస్, బీజేపీలు కలిసి 'ఆపరేషన్ ఆకర్ష్'కు పదును పెట్టాయి. అధికారంలో ఉండటం వల్ల నిధుల కేటాయింపు, అభివృద్ధి పనుల ఆశ చూపి నేతలను ఆకర్షిస్తోంది. ఇప్పటికే మేయర్, డిప్యూటీ మేయర్ వంటి కీలక నేతలు కాంగ్రెస్ కండువా కప్పుకోవడం పార్టీకి పెద్ద దెబ్బ. పట్టణ ప్రాంతాల్లో తమకున్న పట్టును మరింత పెంచుకోవాలని బీజేపీ చూస్తోంది. సికింద్రాబాద్, మల్కాజిగిరి, చేవెళ్ల లోక్‌సభ స్థానాలను కైవసం చేసుకోవడం ఆ పార్టీకి కొండంత బలాన్నిచ్చింది. గులాబీ పార్టీ నుండి అసంతృప్త నేతలను చేర్చుకుని, 300 డివిజన్లలో బలమైన అభ్యర్థులను నిలబెట్టాలని కమలనాథులు భావిస్తున్నారు.ప్రస్తుతం ఉన్న కార్పొరేటర్లు, టికెట్ ఆశావహులు తమ అనుచరులతో




మంతనాలు జరుపుతున్నారు. "గులాబీ పార్టీలో ఉంటే భవిష్యత్తు ఉంటుందా? లేక కాంగ్రెస్, బీజేపీలలో చేరి టికెట్ హామీ పొందాలా?" అనే సందిగ్ధంలో వారున్నారు. మార్చి చివరి వారం లేదా ఏప్రిల్ మొదటి వారం నాటికి మెజారిటీ నేతలు తమ పార్టీ మార్పుపై ఒక స్పష్టమైన నిర్ణయానికి వచ్చే అవకాశం ఉందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు బీఆర్ఎస్ కేడర్‌ను కాపాడుకోవడం ఆ పార్టీకి ఇప్పుడు కత్తిమీద సామేనని చెప్పొచ్చు. కొత్త అభ్యర్థులను వెతుక్కోవడం, ఉన్నవారిని బుజ్జగించడం నాయకత్వానికి సవాలుగా మారింది. ప్రభుత్వం ఉన్నప్పటికీ, హైదరాబాద్ నగర పరిధిలో క్షేత్రస్థాయిలో పార్టీ యంత్రాంగం బలహీనంగా ఉంది. వచ్చే 'రెడీమేడ్' నేతలే వీరికి ఆధారం. ఇక పట్టణ ఓటర్లు బీజేపీ వైపు మొగ్గు చూపుతున్నా, 300 మంది సమర్థవంతమైన అభ్యర్థులను వెతకడం వారికి పెద్ద టాస్క్.మొత్తానికి గ్రేటర్ హైదరాబాద్ ఇప్పుడు రాజకీయ చదరంగంగా మారింది. మూడు కార్పొరేషన్ల ఏర్పాటు కేవలం పాలనా సౌలభ్యం కోసమేనా లేక రాజకీయంగా గులాబీ పార్టీకిను దెబ్బతీయడానికా అన్నది పక్కన పెడితే.. ఈ వలసల పర్వం మాత్రం తెలంగాణ రాజకీయాల్లో కొత్త ప్రకంపనలు సృష్టిస్తోంది. రాబోయే కార్పొరేషన్ ఎన్నికలే వచ్చే అసెంబ్లీ ఎన్నికలకు రిహార్సల్స్‌గా మారనున్నాయి.

## పోషకాలతో కూడిన ఆహారం అందించాలి



**జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష.**

**కాల్వ శ్రీరాంపూర్ కే.జి.బి.వీ ను ఆకస్మికంగా తనిఖీ**

**అగ్నిధారన్యూస్ కాల్వ శ్రీరాం పూర్, మార్చి 10:-** విద్యార్థినులకు మంచి పోషకాలతో కూడిన నాణ్యమైన ఆహారం అందించాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష తెలిపారు

మంగళవారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష కాల్వ శ్రీరాంపూర్ మండలంలో కే.జి.బి.వీ ను ఆకస్మికంగా తనిఖీ చేసి విద్యార్థినులతో కలిసి భోజనం చేసారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష, కేజీబీవీ లోని తరగతి గదులు, డైనింగ్ హాల్ , కిచెన్ ఏరియా పరిశీలించారు. విద్యార్థులకు అందుతున్న విద్యా బోధన, ఇతర సౌకర్యాల గురించి ఆరా తీశారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యాచరణలో భాగంగా కేజీబీవీ పరిసరాలను క్లీన్ చేయాలని కలెక్టర్ తెలిపారు. విద్యార్థినులకు అందించే ఆహారం పట్ల పూర్తి జాగ్రత్తలు తీసుకోవాలని, ప్రభుత్వ మార్గ దర్శకాల ప్రకారం అవసరమైన మేర పోషకాలు వచ్చే విధంగా చూడాలని అన్నారు. అంతకు ముందు ఓదెల మండలం కొలనూరు గ్రామంలో 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యాచరణలో భాగంగా అమలు చేస్తున్న పారిశుధ్య పనులు, ఫైల్ క్లీయరెన్స్ అంశాలను కలెక్టర్ తనిఖీ చేశారు. ఈ పర్యటనలో జిల్లా కలెక్టర్ వెంట సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## ఏప్రిల్ 10 వ తేదీ లోపల హాస్టల్‌లు, స్కూల్స్, కళాశాలలో అవసరమైన వసతుల కోసం ప్రతిపాదనలు

**అధికారులను ఆదేశించిన కలెక్టర్ ప్రావీణ్య**

**సంగారెడ్డి :** సంగారెడ్డి నియోజకవర్గం లోని ప్రభుత్వ గర్ల్స్ ,బాయ్స్ హాస్టళ్లు, హై స్కూల్ లు, జూనియర్ కాలేజీలు, డిగ్రీ కాలేజీల లో బాత్ రూమ్ లు, అదనపు గదులు, స్వంత భవనాలు, మంచి నీటి వసతుల కల్పన కోసం కలెక్టర్ ప్రావీణ్య, నిర్మల, జగ్గారెడ్డి రివ్యూ సమావేశం నిర్వహించారు, ఏప్రిల్ 10 వ తేదీ లోపల హాస్టల్ లు, స్కూల్స్, కళాశాలలో అవసరమైన వసతుల కోసం ప్రతిపాదనలు సిద్ధం చేసి తనకు సమర్పించాలని అధికారులను కలెక్టర్ ప్రావీణ్య ఆదేశించారు. ప్రభుత్వ విద్యా సంస్థల్లో వసతుల కల్పన కోసం 60 శాతం పరిశ్రమల సిఎస్ఆర్ నిధులతో పాటు 40 శాతం నిధులు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సహకారంతో తీసుకువస్తామని జగ్గారెడ్డి, నిర్మల తెలిపారు. కలెక్టర్ రివ్యూ సమావేశం లో పాల్గొన్న సిపిఒ, బిసీ, ఎస్సీ, ఎస్టీ సంక్షేమ శాఖ అధికారులు, అన్ని జూనియర్ , డిగ్రీ కలశాల ప్రిన్సిపల్స్ . కూన సంతోష్, మున్సిపల్ చైర్మన్ వనిత, వైస్ చైర్మన్ షఫీ, సదాశివపేట మున్సిపల్ చైర్మన్ మునిపల్లె సత్యనారాయణ, వైస్ చైర్మన్ చిరు, నియోజకవర్గ ఇంచార్జి ఆంజనేయులు, సిడిసి చైర్మెన్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రామ్ రెడ్డి, ఆత్మ కమిటీ చైర్మన్ ప్రభు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు చిదృ ప్పా రఘు గౌడ్, సదాశివపేట మార్కెట్ కమిటీ చైర్మన్ నర్సింహ రెడ్డి, పార్టీ అధ్యక్షు లు జార్జ్, సిద్దన్న, బుచ్చి రాములు, మోతి, కంది సర్పంచ్ శ్రీరామ్ లతో పాటు పలువురు నాయకులు పాల్గొన్నారు.

## రక్త దానం మహాదానం.. తోటి వారికి ప్రాణదానం

**వికారాబాద్ :**మహిళా దినోత్సవ సందర్భంగా ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ లో రక్తదాన శిబిరం నిర్వహించారు.ఈ రక్తదాన శిబిరం లో వికారాబాద్ జిల్లా రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ సాయి చౌదరి 117 వ సారి స్వచ్ఛంద రక్తదానం చేసారు.ఈ సందర్భంగా కలెక్టర్ దీపక్ తివారి మాట్లాడుతూ రక్త దానం మహాదానమని తోటి వారికి ప్రాణదానం అన్నారు. ప్రతి ఒక్కరు రక్తదానం చేసి తోటి ప్రాణాలు కాపాడాలని పిలుపు నిచ్చారు. మహిళా దినోత్సవ సందర్భంగా నేడు మహిళా దినోత్సవ సందర్భంగా 117 వ సారి రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ సాయి చౌదరి రక్తదాన చేయడం అభినందనీయమన్నారు. అనంతరం సాయి చౌదరి కలెక్టర్ దీపక్ తివారి నుండి రక్తదాన ప్రశంసా పత్రం అందుకున్నారు.

## గ్రామ కాంగ్రెస్ జెండానే ఎగరాలి. కలిసికట్టుగా పనిచేద్దాం.

**వనపర్తి :**మొదటి వరసలో నిలబెడదాం.గ్రామ అధ్యక్షుడి, బూత్ కన్వీనర్ పాత్ర కీలకంగా ఉంటుంది ఖిల్లా ఘణపురం, పెద్దమందడి మండలాల మండల కమిటీ ఎన్నిక కార్యక్రమంల.వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు శివసేన రెడ్డి . కాంగ్రెస్ పార్టీ గ్రామ గ్రామాన సంస్థ గతంగా బలోపేతం అవ్వాలని, ఇందులో గ్రామ అధ్యక్షులతోపాటు బూత్ కన్వీనర్ల పాత్ర చాలా ప్రధానంగా ఉంటుందని వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు శివసేనరెడ్డి పేర్కొన్నారు.మంగళవారం వనపర్తి నియోజకవర్గ పరిధిలోని ఖిల్లా ఘణపురం, పెద్దమందడి మండలాల్లో ఏర్పాటుచేసిన మండల కమిటీ ఎన్నిక కార్యక్రమంలో వారు పాల్గొని మాట్లాడారు.పార్లమెంట్ లీడర్ ఆఫ్ అపోజిషన్ రాహుల్ గాంధీ గారిని బావి భారత ప్రధాని గా చేసింతవరకు కాంగ్రెస్ పార్టీ శ్రేణులు నిర్విరామంగా శ్రమించాలని అందుకు ప్రస్తుతం ఏర్పాటు చేస్తున్న గ్రామ మండల స్థాయి కమిటీలకు ఎంతో ప్రాధాన్యత ఉంటుందని వారన్నారు.కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలుగా నాయకులుగా పార్టీ తరపున ఏర్పాటు చేసే వివిధ విభాగంలో ఉండే కాంగ్రెస్ పార్టీ శ్రేణులు అందరూ పార్టీపరమైన ప్రతి కార్యక్రమంలో పాల్గొనాలని, పార్టీ పిలుపు ఇచ్చిన కార్యక్రమాలను నిర్లక్ష్యం చేయకుండా ప్రతి కార్యక్రమంలో పాల్గొనాలని వారు సూచించారు.పార్టీ నాయకులుగా కార్యకర్తలుగా గ్రామ అధ్యక్షులుగా మండలాధ్యక్షులుగా వివిధ ఆర్గనైజేషన్ లో ఉండి పార్టీ కార్యక్రమాల పట్ల మనకెందుకులే అనే ధోరణిని విడనాడాలని, మనకెందుకులే అనుకునే వారెవరు కూడా రాజకీయంగా రాణించలేరని, అలాంటి వారి సహవాసంలో మనం ఉండకూడదన్నారు.నాకేంటి అనే ధోరణి వదిలేసి నేనున్నాగా అంటూ పార్టీ కోసం ప్రతి ఒక్కరు పాటుపడాలని అందరం కలిసి ముందుకెళ్తే గ్రామాల్లో మనకు ఎదురుపడే వారే లేరని ప్రతిపక్షాలన్నింటికీ పాతర వేయవచ్చునని వారన్నారు.గ్రామాల్లో ఎల్లవేళలా అందుబాటులో ఉండి పార్టీ కోసం పనిచేసే వారికి మొదటి ప్రాధాన్యత మొదటి ప్రాధాన్యత ఉంటుందని వారు తెలిపారు.సామాజిక మాధ్యమాల్లో వెనకబడి పోతున్నామని ప్రభుత్వం చేసే పనులను గ్రామంలోని ప్రతి గడపకు చేరవేయాల్సిన బాధ్యత మనకుందని వారు సూచించారు.ఈ సందర్భంగా వారు ఖిల్లా ఘణపురం మండలం, పెద్దమందడి గ్రామ అధ్యక్షులకు సంబంధించినటువంటి ఆశావాహుల పేర్లను వారు సేకరించారు.అధ్యక్ష పదవి కోసం ఆయా మండలాల కాంగ్రెస్ పార్టీ నాయకులు పలువురు దరఖాస్తు చేసుకోవడంతో దరఖాస్తుదారుల వివరాల పూర్వాపరాలను పరిశీలించి కమిటీని త్వరలోనే ప్రకటించినట్లు వారు తెలిపారు తెలిపారు.కార్యక్రమంలో వనపర్తి మార్కెట్ యార్డ్ అధ్యక్షులు శ్రీనివాస్ గౌడ్, టీపీసీసీ జర్నల్ సెక్రెటరీ నందిమల్ల యాదయ్య, గాఃఅ జిల్లా అధ్యక్షులు కోట్ల రవి, వనపర్తి జిల్లా మాజీ అధ్యక్షులు రాజేంద్రప్రసాద్ యాదవ్, మాజీ జెడ్పిటిసి సభ్యులు సోలిపురం రవీందర్ రెడ్డి, వెంకటస్వామి, రమేష్ గౌడ్, వేణుగోపాలకృష్ణ, మండలాధ్యక్షులు విజయ్ కుమార్, పెంటయ్య యాదవ్, సాయి చరణ్ రెడ్డి, సింగిల్ విండో అధ్యక్షులు మురళీధర్ రెడ్డి, క్యామ వెంకటయ్య, వెంకట్రావు, ఐ సత్య రెడ్డి, వనపర్తి వ్యవసాయ మార్కెట్ యార్డ్ ఉపాధ్యక్షులు రామకృష్ణారెడ్డి, జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు వాకిటి ఆదిత్య , న్యాయవాది తిరుపతయ్య, నందిమల్ల త్రినాథ్, మొగిలి సత్య రెడ్డి, చీర్ల జనార్ధన్,

## బిజినెస్

# 8 దేశాల్లో యూపీఐ సేవలు

### ఎల్పీజీ సిలిండర్ బుకింగ్ గడువు పెంపు



అంతర్జాతీయంగా ప్రస్తుతం తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్న సంగతి తెలిసిందే. ఇరాన్– ఇజ్రాయెల్ మధ్య యుద్ధం నడుస్తోంది. అమెరికా కూడా ఇరాన్‌పై దాడులు చేస్తుండగా.. ఇరాన్ అమెరికా– ఇజ్రాయెల్ సహా గల్ఫ్ దేశాలపైనా భీకర దాడులు చేస్తోంది. ఈ యుద్ధం ప్రభావంతో చమురు, సహజవాయువు సరఫరాలో కొరత తలెత్తనుందనే భయాలు నెలకొన్నాయి. ఇప్పటికే వంట గ్యాస్ సిలిండర్ ధరల్ని కేంద్రం పెంచింది. గృహ వినియోగ సిలిండర్ ధర రూ. 60, కమర్షియల్ సిలిండర్ ధర రూ. 115 చొప్పున పెరిగింది. ఈ క్రమంలోనే గ్యాస్ సిలిండర్ల బ్లాక్ మార్కెటింగ్‌ను అడ్డుకునేందుకు కేంద్రం కీలక నిర్ణయం తీసుకుంది. ఇప్పుడు సిలిండర్‌కు సిలిండర్‌కు మధ్య బుకింగ్ గడువు 21 రోజులుగా ఉండగా.. దీనిని 25 రోజులకు పెంచింది. చాలా మంది సిలిండర్లకు కొరత ఏర్పడవచ్చన్న భయాలతో.. ముందస్తుగా బుక్ చేస్తున్నారు. గతంలో సగటున 55 రోజులకు ఒకసారి సిలిండర్ బుక్ చేసుకునే వారు కూడా ఇప్పుడు పశ్చిమాసియాలో యుద్ధ పరిస్థితుల నేపథ్యంలో 15 రోజులకే గ్యాస్ బుక్ చేస్తుండటం ప్రభుత్వం దృష్టికి వచ్చింది. దీంతో 21 రోజుల లాకిన్ నిబంధన తెచ్చింది. ఇప్పుడు ఆ గడువును 25 రోజులకు పెంచినట్లు తెలుస్తోంది. ఎల్పీజీ సరఫరాలో కాస్త అంతరాయం నేపథ్యంలో.. వాస్తవానికి ఆయిల్ కంపెనీలు కొద్ది రోజుల ముందే ముందస్తు చర్యలకు దిగాయి. కనీస గడువును బుధవారం నుంచే చమురు సంస్థలు అనధికారికంగా అమల్లోకి తెచ్చినట్లు తెలుస్తోంది. డబుల్ సిలిండర్ ఉన్న వారికి గడువు 30 రోజులు.. సింగిల్ సిలిండర్ ఉన్న వారికి 21 రోజులుగా నిర్ణయించినట్లు సమాచారం. ఇప్పుడు దానినే 25 రోజులకు చేసినట్లు ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి. పశ్చిమాసియాలో ఉద్రిక్తతల నేపథ్యంలో వంట గ్యాస్ లభ్యతను నిర్ధరించేందుకు కేంద్ర ప్రభుత్వం ఎమర్జెన్సీ పవర్స్‌ను ఉపయోగిస్తోంది. ఎల్పీజీ ఉత్పత్తిని పెంచాలని రిఫైనరీలను ఆదేశించింది. పారిశ్రామిక అవసరాలకు కాకుండా.. గృహ వినియోగదారులకు వంట గ్యాస్ సరఫరానే తొలి ప్రాధాన్యంగా ఉండాలని చమురు సంస్థలకు కేంద్రం స్పష్టం చేసింది.

### ముడి చమురు ధరల పెరుగుదల ద్రవ్యోల్బణంపై పెద్ద ప్రభావం చూపదు



మధ్యప్రాచ్యంలో నెలకొన్న ఆందోళనల నేపథ్యంలో ముడి చమురు ధరలు భారీగా పెరుగుతున్నాయి. ఈ క్రమంలో దేశీయంగా ద్రవ్యోల్బణ పెరుగుతుందనే చర్చలపై కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ స్పందించారు.ప్రపంచ వ్యాప్తంగా ముడి చమురు ధరలు ఇటీవల పెరగడం వల్ల దేశంలో ద్రవ్యోల్బణం భారీగా పెరుగుతుందనే ఆందోళనలు అవసరంలేదని నిర్మలా సీతారామన్ అన్నారు. ఇప్పటికే దేశంలో ద్రవ్యోల్బణం చాలా తక్కువగా ఉంది, భారతీయ రిజర్వ్ బ్యాంక్(ఆర్‌బీఐ) నిర్దేశించిన కనిష్ట పరిమితికి దగ్గరగానే ఉంది. ముడి చమురు ధరలూ దాదాపు ఒక ఏడాది కాలంగా తగ్గుతున్నాయని ఆమె ప్రస్తావించారు. అయితే, ఇటీవల పశ్చిమాసియాలో భౌగోళిక రాజకీయ సంఘర్షణలు ప్రారంభమైన తర్వాత ధరలు పెరిగాయి. ఆ సమయంలో, భారత ముడి చమురు ధర బ్యారెల్‌కు 69.01 డాలర్ల నుంచి రోజుల వ్యవధిలో బ్యారెల్‌కు 80.16కి పెరిగిందని మంత్రి వివరించారు. ఆర్‌బీఐ నివేదిక ప్రకారం, ముడి చమురు ధరలు 10 శాతం పెరిగితే, దేశంలో ద్రవ్యోల్బణం 0.30 శాతం మాత్రమే పెరగవచ్చు. అయితే, ఈ పెరుగుదల కూడా వాస్తవంలో రూపాయి–డాలర్ మారకం రేటు, ప్రపంచ చమురు సరఫరా, డిమాండ్, ఆర్థిక విధానాలు వంటి అనేక అంశాలపై ఆధారపడి ఉంటుందన్నారు.




భారత ప్రధాని మోడీ ఇజ్రాయెల్ పర్యటనలో యూపీఐ అంశం కూడా చర్చనీయాంశమైంది. ఇజ్రాయెల్ ఫాస్ట్ పేమెంట్ వ్యవస్థతో యూపీఐని అనుసంధానం చేయడంపై ఇరుదేశాలు చర్చలు జరిపాయి. యూపీఐని ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు ఆకాశానికెత్తేశారు. దీంతో త్వరలోనే ఇజ్రాయెల్‌లో కూడా యూపీఐ సేవలు అందుబాటులోకి వచ్చే అవకాశం కనిపిస్తోంది. అయితే ఇప్పటికే 8 దేశాల్లో యూపీఐ సేవలు అందుబాటులో ఉన్నాయనే సంగతి చాలామందికి తెలియదు. ఇన్‌స్టంట్‌గా జరిగే ఈ క్యాష్‌లెస్ పేమెంట్స్ వల్ల కొన్ని దేశాల్లో భారతీయ పర్యాటకుల సంఖ్య గణనీయంగా పెరగడం గమనార్హం. ఈ సేవలు వినియోగించుకోవాలంటూ యూపీఐ ఇంటర్నేషనల్ సెటప్ చేసుకుంటే సరిపోతుంది. ఎడారి దేశం యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్‌లో ప్రయాణించే భారతీయులు పేటీయం యాప్‌తో యూపీఐ పేమెంట్స్ చేసుకోవచ్చు. ఫోన్‌పే యూజర్లయితే మాష్రెక్‌కు చెందిన నియోపే టర్మినల్స్‌లో కూడా యూపీఐ సేవలు ఉపయోగించుకోవచ్చు. భారతీయ రూపాయల్లోనే ట్రాన్సాక్షన్ జరుగుతుంది. మారకం విలువను యూడా యాప్స్ చూపిస్తాయి. భారత్ తర్వాత యూపీఐ సేవలను ఆరంభించిన తొలి దేశం భూటాన్. రూపే కార్డుల పేమెంట్‌ను కూడా స్వీకరించే ఈ దేశంలో 2021 నుంచి బీహెచ్ఐఎం ఎనేబుల్ చేసిన యూపీఐ క్యూఆర్ పేమెంట్స్‌ను కూడా అనుమతించారు. దీంతో భారతీయ పర్యాటకులు ఎలాంటి ఇబ్బంది లేకుండా పేటీయంతో యూపీఐ సేవలు వినియోగించుకోవచ్చు. యూపీఐ సేవలు అనుమతించడంతో ఫ్రాన్స్‌కు భారతీయ పర్యటకుల సంఖ్య విపరీతంగా పెరిగింది. 2024లో ఈఫిల్ టవర్ వద్ద యూపీఐ సేవలు ప్రారంభించిన తర్వాత.. భారతీయ పర్యాటకుల సంఖ్య సుమారు 40 శాతం పెరిగిందని అధికారులు చెప్తున్నారు. రెండేళ్ల క్రితమే 2024 మార్చి నెలలో నేపాల్‌లో యూపీఐ సేవలకు అనుమతి లభించింది. యూపీఐ ఇంటర్నేషనల్ ఎనేబుల్ చేసుకున్న వినియోగదారులు.. నేపాల్‌లో చాలా చోట్ల నేరుగా క్యూఆర్ కోడ్ స్కాన్ చేసి పేమెంట్స్ చేసుకోవచ్చు. ద్వీపదేశం సింగపూర్‌లో కూడా 2024 జనవరి నుంచి యూపీఐ పేమెంట్స్ అందుబాటులోకి వచ్చాయి. భీమ్, పేటీయం, ఫోన్‌పే వంటి యాప్స్‌తో ఇక్కడ పేమెంట్స్ చేసుకోవచ్చు. సింగపూర్‌లో నివశించే భారతీయులు స్వదేశంలోని బంధువులకు డబ్బులు పంపేందుకు కూడా యూపీఐ సేవలను వినియోగించుకోవచ్చు. పొరుగు దేశం శ్రీలంకలో కూడా యూపీఐ సేవలు ఫుల్లుగా అందుబాటులో ఉన్నాయి. 2024 మే నుంచి అనుమతించిన ఈ సేవలతో లంకక్యూఆర్‌ను స్కాన్ చేసి నేరుగా పేమెంట్స్ చేయొచ్చు. భారత రూపాయిల్లోనే చెల్లింపులు జరుగుతాయి. అయితే కరెన్సీ మారకం విలువ కూడా యాప్‌లో కనపడుతుంది. భారత టూరిస్టులు మారిషస్‌లో కూడా యూపీఐ పేమెంట్స్ చెయ్యొచ్చు. 2024 ఫిబ్రవరిలో ఆ దేశం యూపీఐ సేవలను అందుబాటులోకి తెచ్చింది. ఈ దేశంలో రూపే సేవలు కూడా విస్తరించారు. ఇప్పుడు ఆ దేశంలో తీసుకునే రూపే కార్డులను భారత్‌లో కూడా ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఉపయోగించుకోవచ్చు. ఎడారి దేశం ఖతర్‌లోని ప్రముఖ టూరిస్ట్ ప్లేసుల్లో, డ్యూటీ ఫ్రీ షాపుల్లో యూపీఐ సేవలు అందుబాటులో ఉన్నాయి. 2025 సెప్టెంబరులో యూపీఐ మాతృసంస్థ ఎన్‌పీసీఐ ఈ విషయాన్ని వెల్లడించింది. ఖతర్‌కు వెళ్లే అత్యధిక టూరిస్టులు వెళ్లే రెండో దేశం భారత్. యూపీఐ సేవల ద్వారా భారతీయ పర్యాటకులను ఆకర్షించడంతో పాటు, కరెన్సీ ఎక్స్ఛేంజ్ ఇబ్బందులను తొలగించేందుకు ఖతర్ ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. మలేసియాలో కూడా అతిత్వరలో యూపీఐ పేమెంట్స్‌ను అందుబాటులోకి తెస్తామని గతేడాది అక్టోబరులో రేజర్‌పే ప్రకటించింది. అదే జరిగితే ఇష్టమొచ్చిన యూపీఐ యాప్ ద్వారా భారతీయ పర్యాటకులు నేరుగా పేమెంట్స్ చేసుకోవచ్చు.

## భారీగా పెరగనున్న భారత చమురు దిగుమతి బిల్లు



ఇరాన్, ఇజ్రాయెల్–యూఎస్ మధ్య పశ్చిమాసియాలో ఉద్రిక్తతల కారణంగా ప్రపంచ ముడి చమురు ధరలు సోమవారం భారీగా పెరిగాయి. ఈ ఉద్రిక్తతల కారణంగా, సరఫరా భయాలు ముడి చమురు ధరలను బ్యారెల్‌కు దాదాపు 115 డాలర్లకు, ఒకానొక సమయంలో 125 డాలర్ల దగ్గరగా పెంచాయి. ఇది 2022 తర్వాత అత్యధిక స్థాయి. దీంతో దిగుమతి చేసుకున్న చమురుపై ఎక్కువగా ఆధారపడిన అనేక దేశాలకు ఆందోళన కలిగించింది. ముఖ్యంగా 85 శాతం చమురు దిగుమతిపై ఆధారపడిన మనదేశానికి ఇది భారం కానుంది. దీని కారణంగా, ప్రపంచ చమురు ధరలు పెరిగినప్పుడు, భారత్ అదే మొత్తంలో చమురును కొనుగోలు చేయడానికి చాలా ఎక్కువ డబ్బు ఖర్చు చేయాల్సి వస్తుంది. గత ఆర్థిక సంవత్సరంలో (2024–25) మనదేశం దాదాపు 137 బిలియన్ డాలర్ల విలువైన 243 మిలియన్ టన్నుల ముడి చమురును దిగుమతి చేసుకుంది.ముడి చమురు ధరలు బ్యారెల్‌కు 100–115 మధ్య ఎక్కువ కాలం కొనసాగితే, మనదేశ చమురు దిగుమతి బిల్లు ప్రతి సంవత్సరం దాదాపు 56–64 బిలియన్ డాలర్లు(మన కరెన్సీలో రూ. 5–5.9 లక్షల కోట్లు) పెరిగే అవకాశం ఉందని నిపుణులు అంటున్నారు. దీనివల్ల కరెంట్ ఖాతా లోటును పెరుగుతుందని, రూపాయి మరింత బలహీనపడొచ్చు, ద్రవ్యోల్బణం కూడా పెరగడం ద్వారా దేశ ఆర్థికవ్యవస్థపై ఒత్తిడిని పెంచుతుంది. అయితే, ఇప్పటివరకు ఆ స్థాయి సంక్షోభం లేదని రేటింగ్ ఏజెన్సీ ఇక్రా ప్రధాన ఆర్థికవేత్త అదితి నాయర్ అన్నారు. కానీ, మధ్యప్రాచ్యంలో ఘర్షణలు కొనసాగితే పరిస్థితి మరింత ప్రమాదంగా మారుతుంది. అధిక చమురు ధరలు ఇంధన ధరలు, రవాణా ఖర్చులు, మొత్తం ఆర్థిక వృద్ధితో సహా ఆర్థిక వ్యవస్థలోని అనేక భాగాలను ప్రభావితం చేస్తాయి. దీన్ని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం, చమురు సంస్థలు పరిస్థితిని నిశితంగా గమనిస్తున్నాయి. దేశంలో తగినంత చమురు సరఫరాలను నిర్వహించేందుకు ప్రయత్నిస్తున్నాయి.

## ప్రపంచ కప్ విజేతలకు బీసీసీఐ భారీ నజరానా..

# రూ.131 కోట్ల ప్రైజ్‌మనీ




టీ20 వరల్డ్ కప్ 2026 ట్రోఫీ గెలిచిన భారత జట్టుకు బీసీసీఐ భారీ నజరానా ప్రకటించింది. గత రికార్డులను తిరగరాస్తూ ఏకంగా రూ.131 కోట్ల ప్రైజ్‌మనీ ప్రకటించింది. ఇది ఇప్పటివరకు వరల్డ్ కప్ విజేతలైన భారత జట్టుకు ఇచ్చిన అత్యధిక నజరానా. ఈ విషయాన్ని బీసీసీఐ సెక్రెటరీ దేవ్‌జిత్ సైకియా మంగళవారం వెల్లడించారు. గతంలో 2024లో రోహిత్ శర్మ నాయకత్వంలో భారత జట్టు టీ20 వరల్డ్ కప్ గెలిచిన సంగతి తెలిసిందే. అప్పట్లో ఈ జట్టుకు రూ.125 కోట్ల ప్రైజ్‌మనీ అందించగా, ఇప్పుడు అంతకంటే ఎక్కువగా బహుమతి ప్రకటించింది బీసీసీఐ. రూ.6 కోట్లు పెంచి రూ.131 కోట్లను బహమతిగా ఇవ్వనుంది. ఇక టోర్నీలో విజేతగా నిలిచిన జట్టుకు అందించే ప్రైజ్‌మనీగా ఇండియాకు ఐసీసీ నుంచి రూ.27.48 కోట్లు దక్కిన సంగతి తెలిసిందే. రన్నరప్‌గా నిలిచిన న్యూజిలాండ్ జట్టుకు రూ.14.65 కోట్లు అందాయి. బీసీసీఐ ప్రకటించిన రూ.131 కోట్లను జట్టులోని 15 మంది సభ్యులకు అందజేస్తారు. అలాగే కోచింగ్ స్టాఫ్, ఇతర సపోర్టింగ్ స్టాఫ్‌కు కూడా ఇందులో వాటా ఉంటుంది. ఈ నగదు బహుమతికి సంబంధించిన బ్రేక్‌డౌన్‌ను బీసీసీఐ అధికారికంగా వెల్లడించదు. కానీ, అత్యధిక అమౌంట్ ఆటగాళ్లకు సమంగా అందుతుంది. ఆ తర్వాత కోచింగ్ స్టాఫ్‌కు దక్కుతుంది. చివరగా సపోర్టింగ్ స్టాఫ్‌కు అందజేస్తారు. వీరికి ఎంత ఇవ్వాలి అనేది బీసీసీఐ పెద్దలు నిర్ణయిస్తారు. ఇక కెప్టెన్ సూర్య కుమార్‌కు అందరికంటే ఎక్కువగా భారీగా ప్రోత్సాహం అందుతుంది. ఆదివారం జరిగిన టీ20 వరల్డ్ కప్ ఫైనల్ మ్యాచులో న్యూజిలాండ్‌పై ఇండియా భారీ విజయం సాధించింది. అందులోనూ సొంతగడ్డపై ఇలా తొలిసారి టోర్నీ గెలిచింది. దీంతో దేశవ్యాప్తంగా జట్టుపై ప్రశంసల వర్షం కురుస్తోంది.

### ఢిల్లీ క్యాపిటల్స్ హెడ్ కోచ్‌కు మరో కీలక పదవి




ఢిల్లీ క్యాపిటల్స్ (ఐపీఎల్ ఫ్రాంచైజీ) హెడ్ కోచ్ హేమంగ్ బదానీకి మరో కీలక పదవి దక్కింది. హండ్రెడ్ లీగ్‌లోని సదరన్ బ్రేవ్ పురుషుల ఫ్రాంచైజీ కూడా అతన్నే హెడ్ కోచ్‌గా నియమించింది. ఈ రెండు ఫ్రాంచైజీలకు +వీ= గ్రూప్ సహ యజమానిగా ఉంది. బ్రేవ్ యాజమాన్యం బదానీకి డిప్యూటీగా (అసిస్టెంట్ కోచ్) ఇంగ్లండ్ మాజీ ఆటగాడు ఇయాన్ బెల్‌ను ఎంపిక చేసింది.

గ్రూప్‌కు ఐపీఎల్ హండ్రెడ్ లీగ్‌తో పాటు మేజర్ లీగ్ క్రికెట్ (ూమ్శ్రీవ ూతీఖ్ఘం), ఇంటర్నేషనల్ లీగ్ టీ20లో (ఐఏఘ్ఘ ఝఝూఝ్ఞృం) కూడా ఫ్రాంచైజీలు ఉన్నాయి.

సదరన్ బ్రేవ్ గత ప్రదర్శనలు

సదరన్ బ్రేవ్ ఫ్రాంచైజీ హండ్రెడ్ లీగ్ తొలి ఎడిషన్‌లో విజేతగా నిలిచింది. ఆతర్వాత 2024 ఎడిషన్‌లో రన్నరప్‌తో సరిపెట్టుకుంది. గత ఎడిషన్‌లో మాత్రం సగం మ్యాచ్‌లు ఓడి, నాకౌట్స్‌కు కూడా చేరలేకపోయింది. కాగా, హండ్రెడ్ లీగ్ 2026 ఎడిషన్ జులై 21 నుంచి ప్రారంభం కానుంది. తొలి మ్యాచ్‌లో ఎంఐ లండన్, సన్‌రైజర్స్ లీడ్స్ పోటీపడనున్నాయి. జులై 22న జరిగే మ్యాచ్‌లో సదరన్ బ్రేవ్ వెల్ష్ ఫైర్‌తో తలపడుతుంది.

**తొలిసారి వేలం**

హండ్రెడ్ లీగ్‌లో తొలిసారి వేలం ద్వారా ఆటగాళ్ల ఎంపిక జరుగనుంది. ఈ వేలం మార్చి 11, 12 తేదీల్లో జరుగనుంది. 18 దేశాలకు చెందిన 400 మంది ఆటగాళ్లు వేలానికి షార్ట్ లిస్ట్ అయ్యారు. ఈ వేలంలో మొత్తం 8 ఫ్రాంచైజీలు పోటీపడతాయి.

## స్పోర్ట్స్

### ఐపీఎల్ షెడ్యూల్‌పై ఉత్కంఠకు తెర.. తొలి దశ మ్యాచ్‌లకు ముహూర్తం అప్పుడే!




పొట్టి ప్రపంచకప్ ముగియడంతో ఐపీఎల్(ఖూూ) పండుగ కోసం క్రీడాభిమానులు ఎదురు చూస్తున్నారు. మార్చి 28 నుంచి మొదలయ్యే పంతొమ్మిదో సీజన్ దశల వారీగా జరగనుంది. అయితే.. కొన్ని రాష్ట్రాల్లో ఎన్నికల నేపథ్యంలో షెడ్యూల్ విడుదలను బీసీసీఐ(దీజజ×) ఆలస్యం చేస్తున్న విషయం తెలిసిందే. ఈ పరిస్థితుల్లో బీసీసీఐ సెక్రటరీ దేవజిత్ సైకియా (ఐవఝుఙత్ ూఖఆఎఖు) బిగ్ హింట్ ఇచ్చాడు. షెడ్యూల్‌పై నెలకొన్న ఉత్కంఠకు తెరదించుతూ వచ్చే రెండు మూడు రోజుల్లోనే తొలి దశ షెడ్యూల్ విడుదల చేస్తామని చెప్పాడు. ఇండియన్ ప్రీమియర్ లీగ్ 19వ సీజన్‌కు మరో 18 రోజులే ఉంది. రెండు దశల్లో జరిగే ఈ మెగా టోర్నీ మార్చి 28 నుంచి ప్రారంభం కానుంది. దాంతో.. తొలి దశ షెడ్యూల్‌పై మంగళవారం బీసీసీఐ సెక్రటరీ దేవజిత్ సైకియా స్పష్టతనిచ్చాడు. మార్చి 12న లేదా 13వ తేదీన షెడ్యూల్ విడుదల కానుందని ఆయన చెప్పాడు. 'ఐపీఎల్ 19వ సీజన్ షెడ్యూల్‌ను ఒకటి రెండు రోజుల్లో విడుదల చేయాలని అనకుంటున్నాం' అని క్రిక్ బజ్‌తో సైకియా తెలిపాడు. 'ఐపీఎల్‌ను రెండు దశలుగా నిర్వహించాలనుకుంటున్నాం. త్వరలోనే తొలి దశ షెడ్యూల్ ప్రకటిస్తాం. మొదటి 20 రోజుల మ్యాచ్‌లకు సంబంధించిన షెడ్యూల్ అందులో ఉంటుంది. మార్చి 12న లేదంటే 13వ తేదీన.. ఈ రెండు తేదీల్లో కచ్చితంగా షెడ్యూల్ విడుదల చేస్తాం. కొన్ని రాష్ట్రాల్లో అసెంబ్లీ ఎన్నికల తేదీలను ఎన్నికల సంఘం ఖరారు చేసిన తర్వాత రెండో దశ షెడ్యూల్‌ను ప్రకటిస్తాం' అని బీసీసీఐ సెక్రటరీ వెల్లడించాడు.

**ఎన్నికల షెడ్యూల్ ఖరారయ్యాక**

త్వరలోనే తమిళనాడు, అస్సాం, బెంగాల్, కేరళమ్ రాష్ట్రాల్లో అసెంబ్లీ ఎన్నికలు జరుగనున్నాయి. దాంతో.. ఎన్నికల షెడ్యూల్ ఖరారయ్యాక ఐపీఎల్ షెడ్యూల్ విడులకు బీసీసీఐ సన్నాహకాలు చేస్తోంది. ఈ నాలుగు రాష్ట్రాల్లో ఎన్నికల నేపథ్యంలోనే రెండు దశలుగా టోర్నీని నిర్వహించాలని బీసీసీఐ, ఐపీఎల్ పాలక మండలి నిర్ణయించాయి. మరో విషయం.. పశ్చిమాసియా దేశాల్లోని యుద్ధం ప్రభావంతో ప్రపంచవ్యాప్తంగా ఇంధనం కొరత ఏర్పడుతోంది. ప్రస్తుతానికి అసెంబ్లీ ఎన్నికలు మినహా, మిగతావేవీ బీసీసీఐపై ప్రభావం చూపడం లేదని సైకియా అన్నాడు. పంతొమ్మిదో సీజన్‌ను మే 31వ తేదీలోపే ముగిస్తామని ఆయన పేర్కొన్నాడు.



## ఆన్‌లైన్ వేధింపులపై పోలీసులకు లావణ్య త్రిపాఠి ఫిర్యాదు!

టాలీవుడ్ నటి, మెగా వారసుడు వరుణ్ తేజ్ భార్య లావణ్య త్రిపాఠి తన పరువుకు భంగం కలిగించే వారిపై న్యాయ పోరాటానికి దిగారు. ఇన్‌స్టాగ్రామ్ వేదికగా తనపై, మెగా కుటుంబంపై అసభ్యకరమైన పోస్టులు పెడుతూ వేధింపులకు పాల్పడుతున్న అకౌంట్లపై ఆమె సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. నిరంతరం వేధింపులకు గురిచేస్తూ, తన ప్రైవసీకి భంగం కలిగిస్తున్నారనే ఉద్దేశంతో ఆమె ఈ కఠిన నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. ముఖ్యంగా 'పర్పుల్ క్రెయాన్00' అనే ఖాతా ద్వారా గత కొంతకాలంగా లావణ్యను టార్గెట్ చేస్తూ అసభ్యకరమైన కామెంట్లు వస్తున్నట్లు సమాచారం. తన క్యారెక్టర్‌ను కించపరచడమే కాకుండా, కుటుంబ సభ్యులను కూడా వివాదాల్లోకి లాగడంపై లావణ్య తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కేవలం విమర్శలు చేయడం వేరు, కానీ అసభ్యతకు పాల్పడటం నేరమని భావించిన ఆమె, పోలీసుల ద్వారా నిందితులకు బుద్ధి చెప్పాలని నిర్ణయించుకున్నారు. లావణ్య ఫిర్యాదు మేరకు పోలీసులు ఐటీ చట్టం సెక్షన్ 67 (అశ్లీల సమాచారాన్ని ప్రసారం చేయడం) భారత న్యాయ సంహిత (ఃబొ) సెక్షన్లు 78, 79 కింద కేసులు నమోదు చేశారు. ఈ అకౌంట్ వెనుక ఉన్న వ్యక్తులను ఐపీ అడ్రస్ ఆధారంగా గుర్తించే పనిలో సైబర్ క్రైమ్ విభాగం నిమగ్నమైంది. త్వరలోనే నిందితులను అరెస్ట్ చేస్తామని పోలీసులు ధీమా వ్యక్తం చేస్తున్నారు. సెలబ్రిటీల మీద విమర్శలు చేయడం వేరు, కానీ వారి వ్యక్తిగత విషయాల గురించి అసభ్యంగా మాట్లాడటం నేరమని ఈ కేసు ద్వారా లావణ్య స్పష్టం చేశారు.



## ఇది నిశ్చితార్థం కాదు.. నా కావ్యమ్మకు అంటూ అదిరిపోయే ట్విస్ట్

హీరో బెల్లంకొండ సాయి శ్రీనివాస్ తన బ్యాచిలర్ లైఫ్‌కు గుడ్ బై చెప్పి ఓ ఇంటివాడు కాబోతున్నాడనే సంగతి తెలిసిందే. అంతే కాకుండా.. తనకు కాబోయే భార్యతో ఉన్న ఫొటోలు కూడా సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. దీంతో సాయి శ్రీనివాస్ సీక్రెట్‌గా ఎంగేజ్మెంట్ చేసేసుకున్నాడు అంటూ వార్తలు వచ్చిన విషయం తెలిసిందే. అయితే.. దీనిపై క్లారిటీ ఇస్తూ తాజాగా సాయి తన సోషల్ మీడియా వేదికగా ఓ ఇంట్రెస్టింగ్ పోస్ట్ పెట్టాడు. 'నా కావ్యమ్మకు.. జీవితానికి ఓ స్వంత అందమైన సమయం ఉంటుంది.. అది నిన్ను నా ప్రపంచంలోకి తీసుకువచ్చింది. నువ్వు నా లైఫ్‌లోకి వచ్చినందుకు థాంక్యూ. నీ రాకతో నా డేస్ మొత్తం సంతోషం అండ్ ఆనందంతో నిండిపోయాయి. నీ ముఖంలోని చిరునవ్వు ఎప్పటికీ పోనివ్వకుండా చూసుకుంటాను.. మనం ఎప్పటికీ కలిసి ఉండే రోజు కోసం నేను వేచి ఉండలేకపోతున్నా.. ప్రేమతో నీ శ్రీని...' అని తన పియాన్సీతో ఉన్న ఫొటోలను షేర్ చేశాడు. అలాగే నిశ్చితార్థం అయిపోయింది అని అనుకుంటున్న వారిని ఉద్దేశిస్తూ.. 'అడుగుతున్న ప్రతి ఒక్కరికీ.. ఇది నిశ్చితార్థం కాదు.. కేవలం ఫ్యామిలీ అనౌన్స్‌మెంట్ మాత్రమే. వేడుకలు ఇంకా ప్రారంభం కాలేదు..తేదీలు త్వరలో ప్రకటించబడతాయి' అంటూ చెప్పుకొచ్చాడు. కాగా.. హీరో బెల్లంకొండ సాయి శ్రీనివాస్ త్వరలో కావ్య రెడ్డిని వివాహం చేసుకోబోతున్నారు. ఈ నేపథ్యంలో వీరి రోకా వేడుక ఇరు కుటుంబాల సమక్షంలో ఘనంగా నిర్వహించారు. రోకా వేడుక కావ్య రెడ్డి నివాసంలో ఘనంగా జరిగింది. ఈ వేడుకలో దర్శకులు బోయపాటి శ్రీను, అనిల్ రావిపూడి, గోపీచంద్ మలినేని, నిర్మాతలు శిరీష్, సాహు గారపాటి, రామ్ ఆచంట, మిర్యాల రవీందర్ రెడ్డి, నాగ వంశీ, కేకే రాధామోహన్, ధీరజ్ మొగిలినేని, హీరోయిన్ సంయుక్త తదితర సినీ ప్రముఖులు పాల్గొన్నారు. దీనికి సంబంధించిన ఫొటోలు వైరల్ కాగా.. ప్రతి ఒక్కరు బెల్లంకొండ సాయి శ్రీనివాస్ సీక్రెట్‌గా నిశ్చితార్థం చేసుకున్నాడని భావించారు. బెల్లంకొండ సాయి శ్రీనివాస్, కావ్య రెడ్డి నిశ్చితార్థం, వివాహ తేదీలను త్వరలోనే అధికారికంగా ప్రకటించనున్నట్లు తెలపడంతో ఫ్యాన్స్ ఖుష్ అవుతున్నారు.



## సత్య 'జెట్లీ' షూటింగ్ పూర్తి

టాలీవుడ్ ఫేవరేట్ ద్వయం సత్య, దర్శకుడు రితేష్ రానా త్వరలో 'జెట్లీ'తో అలరించబోతున్నారు. ప్రతిష్టాత్మక మైత్రీ మూవీ మేకర్స్ సమర్పణలో క్లాప్ ఎంటర్‌టైన్‌మెంట్ చిరంజీవి (చెర్రీ), హేమలత పెద్దమల్లు నిర్మిస్తున్నారు. ఈ సినిమా నుంచి ఇప్పటికే రిలీజ్ చేసిన ఫస్ట్ లుక్స్ పోస్టర్స్, గ్లింప్స్‌కు ట్రెమండస్ రెస్పాన్స్ వచ్చింది. ఈ క్రమంలోనే తాజాగా మరో అప్డేట్ ఇచ్చారు మేకర్స్. ఈ చిత్రం షూటింగ్ పూర్తి చేసుకున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా రిలీజ్ చేసిన స్పెషల్ వీడియోలో సత్య ఫన్ మూమెంట్స్ ఆకట్టుకున్నాయి. ఈ చిత్రంతో మిస్ యూనివర్స్ ఇండియా రియా సింఘా తెలుగులో పరిచయం కానుంది. రితేష్ రానా స్టైల్, సిగ్నేచర్ హ్యూమర్‌తో పాటు హై-ఎనర్జీ యాక్షన్ మేళవించిన జెట్లీ ఫన్-ప్యాక్డ్ ఎక్స్ పీరియన్స్ అందించబోతుంది. ఈ సినిమాకు సంబంధించి మరిన్ని వివరాలు త్వరలో తెలపనున్నారు మేకర్స్.

## విలేజ్ బ్యాక్ డ్రాప్‌లో మరో కొత్త సినిమా

ఉఓం ఎంటర్టైన్మెంట్స్ అనే బ్యానర్‌పై ప్రేక్షకుల ముందుకు రానున్న చిత్రం 'ఖీ'. గోలి రామకృష్ణ దర్శక నిర్మాణంలో వస్తున్న ఈ విలేజ్ బ్యాక్ డ్రాప్ సినిమాకు గాలి బాల కిరణ్ రెడ్డి సహ నిర్మాతగా వ్యవహరిస్తున్నారు. తాజాగా ఈ సినిమా శ్రీ ప్రసన్నాంజనేయ స్వామి దేవాలయంలో పూజ కార్యక్రమాలతో ఘనంగా స్టార్ట్ అయింది. సంతోష్ కృష్ణన్, భాగ్య రెడ్డి, బ్రహ్మానందం రెడ్డి, దుర్గమ నాయుడు, పవన్, సిరి, సంధ్య, భాను చందర్, స్వాతి తదితరులు కీలకపాత్రలు పోషించనున్న ఈ సినిమా షూటింగ్ ఈనెల 20వ తేదీ నుండి ప్రారంభం కానుంది. ఈ సంవత్సరంలోనే అక్టోబర్ 17వ తేదీన విడుదల కానుందని మేకర్స్ తెలిపారు. ఈ మేరకు దర్శక నిర్మాత గోలి రామకృష్ణ మాట్లాడుతూ.. 'ఈ చిత్రాన్ని రెండు షెడ్యూల్స్ లోనే మాకు ఉన్న స్క్రిప్ట్‌తో, నటీనటుల సహకారంతో చిత్ర షూటింగ్ హైదరాబాద్ పరిసర ప్రాంతాలలో పూర్తి చేస్తాము. మంచి సందేశాత్మకమైన చిత్రంగా మీ ముందుకు అక్టోబర్ 17వ తేదీన ఖీ చిత్రం రానుంది. ఈ చిత్రానికి సంబంధించిన ఇతర విషయాలు త్వరలోనే ఒక విభిన్నమైన శైలిలో తెలియజేస్తాము' అన్నారు.





## ఈ థ్రిల్లర్ అందరికీ నచ్చుతుంది

కంటెంట్ కింగ్ శ్రీ విష్ణు హీరోగా హుస్సేన్ షా కిరణ్ తెరకెక్కించిన చిత్రం 'మృత్యుంజయ్'. ఈ ఇన్వెస్టిగేటివ్ థ్రిల్లర్ మార్చి 6న విడుదలై బ్లాక్ బస్టర్ హిట్ టాక్ సొంతం చేసుకుంది. ఈ క్రమంలోనే తాజాగా సక్సెస్ మీట్‌ను నిర్వహించారు. ఈ ఈవెంట్‌లో హీరో శ్రీ విష్ణు మాట్లాడుతూ.. 'ఈ సినిమాలో అందరూ అద్భుతంగా నటించారు. ఈ మూవీని ఆడియెన్స్ చాలా ఫ్రెష్‌గా ఫీల్ అవుతున్నారు. సాగర్ మా అందరినీ చాలా కొత్తగా చూపించారు. హుస్సేన్ రైటింగ్, ట్విస్ట్‌లు అద్భుతంగా అనిపించాయి. కాళ భైరవ ఆర్ఆర్ చూసి నేను కూడా షాక్ అయ్యాను. ఆయన ఆర్ఆర్ వల్లే సినిమా స్థాయి పెరిగింది. ఈ చిత్రానికి ఆయనే నిజమైన హీరో. సినిమా చూసిన వాళ్లంతా గొప్పగా ఉందని ప్రశంసిస్తున్నారు. ఇంకా చూడని వాళ్లుంటే వెంటనే మా మూవీని చూడండి. తెలుగులో చాలా అరుదుగా వచ్చే థ్రిల్లర్‌లో ఇదొక మంచి సినిమా అవుతుంది. ఈ మంచి థ్రిల్లర్ అందరికీ నచ్చుతుంది తప్పకుండా చూడండి. ఇంకా మా మూవీని ఇలానే చూసి పెద్ద సక్సెస్ చేయాలని కోరుకుంటున్నాను' అని అన్నారు.